4 పేజీలు: 7 నయాపైసలు — ANDHRA JANATHA

200226

ఆంధ్రజనత

Regd No: H.634

హైద్రాబాద్, మంగళవారం 22-9-1959

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

సంపుటి 5 సంచిక 88

DEPT. OF INFORMATION & PUBLIC RELATIONS
GOVT. OF ANDHRA PRADESH, HYDERABAD.
NEWS PAPER RECORDS
FILE COPY

ఆంధ్రజనత
చందా వివరాలు

సంవత్సరం	రూ. 27-00
6 నెలలు	రూ. 14-00
3 నెలలు	రూ. 7-00

మూడు నెలలకు తక్కువ చందా స్వీకరించబడదు.
వివరాలకు:
మేనేజర్,
ఆంధ్ర జనత
గాంధీ భవనం హైదరాబాదు,

అమెరికా కార్మిక నాయకులతో కృశ్చేవ్ చర్చలు

శాన్‌ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 21

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ నిన్నరాత్రి ఇక్కడ అమెరికా కార్మిక సంఘాలకు సంబంధించిన అగ్ర నాయకులను కలుసుకున్నారు.

సోవియట్, అమెరికా దేశాలలోని కార్మిక విధానాలపై దాదాపు మూడున్నర గంటల సేపు తీవ్రమైన చర్చలు జరిగాయి.

"రెండు విధానాలకీ మధ్య రాజీ అవసరం" అని కృశ్చేవ్ అన్నట్టు కార్మిక సంఘాల ప్రతినిధి వాల్టర్ రూథర్ విలేఖరులతో అన్నారు.

దేశంలో 50 లక్షల టన్నుల ధాన్యం నిల్వకు ప్రభుత్వ ప్రయత్నం

ఢిల్లీ, మద్రాస్ మధ్య రైలు ప్రయాణాలు

వచ్చే శుక్రవారం నాటికి గాని సాధ్యం కావు

("ఆంధ్ర జనత" విలేఖరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 21

మద్రాసు, ఢిల్లీ నగరాల మధ్య మామూలు రైలు ప్రయాణాలు వచ్చే శుక్ర, శనివారాల నాటికి గాని తిరిగి ప్రారంభం కావని సికింద్రాబాద్‌లో రైల్వే డివిజన్ కార్యాలయంలో నిచారించగా తెలుస్తున్నది. కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లో మానిక్ ఘర్ దగ్గర 400 అడుగుల పొడవు రైలు కట్ట పూర్తి మూలాన కొట్టుకు పోవటం వేతయీ నెల 14 తేదీ నుంచి ఈ మార్గాన మద్రాసు - ఢిల్లీ నగరాల మధ్య మామూలు రైలు ప్రయాణాలకు ఆటంక మేర్పడింది.

పడులు, వందలు ఇంజనీర్లు, ఇన్‌స్పెక్టర్ల యాజమాన్యాన రెండువేల మంది కార్మికులు అహర్నిశలు, విసుగు, విరామం లేకుండా యిరువది నాల్గు గంటలూ యీ రైలు మార్గ పునర్నిర్మాణానికై పని చేస్తున్నారు. గండి పడిన ప్రాంతంలో, యీ ప్రత్యామ్నాయ రైలు మార్గ నిర్మాణం జరుగుతున్నది. దీనికి మూడువేల వ్యాగన్ల కంకర అవసరమైంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ వారి ఆధీనంలో వున్న బుల్‌డోజర్లు, రైల్వే యింజనీర్ల కవసరమైన యితర యంత్ర సామాగ్రిని తమ దగ్గర వున్నంత వరకు అంద జేశారు.

ఈ ప్రాంతాల్లో, మామూలు రైలు ప్రయాణాలకు ప్రతి యేటా వర్షాకాలంలో అవరోధాలు కల్గుతూ నే వుంటున్నాయి. కాబట్టి ప్రస్తుతం గండి పడిన ప్రాంతంలో పై నీరు పోయేందుకు శాశ్వత చర్యగా వంతెన నిర్మించే విషయం రైల్వే అధికారులు ఆలోచిస్తున్నారు.

అమెరికాతో త్వరలో సంప్రతింపులు

కేంద్ర మంత్రి శ్రీ పాటిల్ సూచన

మద్రాసు, సెప్టెంబర్ 21

అమెరికా తన మిగులు ధాన్యంలో 50 లక్షల టన్నులను బ్యాంకు మోస్తరుగా ఇండియాలో నిల్వ చేసేటట్టు ప్రయత్నిస్తున్నామని కేంద్ర ఆహార మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ నేడు ఇక్కడ వెల్లడించారు.

దేశంలో అలా నిల్వచేసే ధాన్యాన్ని మనం అత్యవసర పరిస్థితిలో వాడుకొన వచ్చునని ఆయన అన్నారు.

భారతదేశంలో అమెరికా మిగులు ఆహార ధాన్యాలను నిల్వచేయటానికి వసతి సౌకర్యం కల్పించగలమని ఆయన అన్నారు.

నేడిక్కడ విలేఖరులగోష్ఠిలో శ్రీ పాటిల్ పై విషయాలను తెలియజేసారు. తన ప్రతిపాదన ప్రకారం ఇక్కడ నిల్వచేసే ధాన్యం అమెరికా పద్దుక్రిందనే ఉంటుందనీ, అయితే మనం నిల్వలో కొంత వాడుకొన్నప్పుడు మట్టుకు పైకం చెల్లించవలసి ఉంటుందనీ ఆయన వివరించారు.

మరో ఆరు లేక పన్నెండు నెలల్లో ఇందుకు సంబంధించి ఒక ఒప్పందం జరగగలదని ఆయన ఆశాభావం ప్రకటించారు. ఇతర దేశాలనుంచి 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను తెచ్చి అదనపు నిల్వలు ఏర్పాటు చేసుకోవటం అవసరమని ఆయన అన్నారు.

మన దేశంలో పండే ధాన్యం మన వాడకానికి చాలుననీ, అయితే ధరల స్థిరీకరణ కోసం అదనపు నిల్వలు అవసరమౌతున్నాయనీ ఆయన అన్నారు. 250 వేల టన్నుల చక్కెరను కూడా దిగుమతి చేసుకొని నిల్వ చేయాలని నిశ్చయించినట్టు ఆయన వెల్లడించారు. ఆహార మంత్రిత్వ శాఖను స్వీకరించిన తర్వాత దేశంలో కొరతలు నేదిలేదని

(మిగతా 4 వ పేజీలో)

దక్షిణ ఆహార మండలం భవితవ్యం

వచ్చే 25 న తేదీన కేంద్రం నిర్ణయాన్ని ప్రకటించే సూచన

మద్రాసు, సెప్టెంబర్ 21

దక్షిణ ఆహార మండలం భవితవ్యం విషయమై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సెప్టెంబర్ 25వ తేదీన ప్రకటిస్తారని మద్రాసు రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ భక్తవత్సలం నేడు విలేఖరులకు తెలియజేసారు.

కేంద్ర ఆహార మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్‌తో నేటి ఉదయం ఇక్కడ శ్రీ భక్తవత్సలం చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని త్వరగా ప్రకటించాలనీ, అలా చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించుకునే అవకాశం కలుగుతుందనీ తాను శ్రీ పాటిల్‌కు విజ్ఞప్తి చేసినట్టు ఆయన తెలియజేసారు.

దక్షిణ ఆహార మండలాన్ని రద్దుచేసి మద్రాసు రాష్ట్రాన్ని ప్రత్యేక ఆహార మండలం చేయాలని చాలా కాలంగా మద్రాసు ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నది.

జినాఖా గ్రామంలో త్రొక్కిడిపిల్ల మరణాలు

రాజకోట, సెప్టెంబర్ 21

నిన్నటి దినం అమ్రేలి జిల్లా లోని జినాఖా గ్రామంలో త్రొక్కిడివల్ల మరణించిన వారి సంఖ్య నేడు 62 వరకు పెరిగినది.

ప్రధాని నెహ్రూ నాల్గు రోజుల అధికార పర్యటనపై కాబూల్ వచ్చినప్పుడు విమానాశ్రయంలో స్వాగతాన్ని స్వీకరిస్తున్న దృశ్యం. ప్రక్కన ఉన్న వారు ఆఫ్ఘన్ ప్రధాని సర్దార్ మహమ్మద్ దావూద్.

పరీక్షా విధానంలో లోపాల సవరణ

ఢిల్లీ సమావేశంలో కేంద్ర విద్యా మంత్రి డాక్టర్ శ్రీమాలి సూచనలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21

సెకండరీ పబ్లిక్ పరీక్షలలో పెక్కుమంది అభ్యర్థులు తప్పిపోవటం, పరీక్షా విధానం సంస్కరణ వ్యవహారాలను చర్చించటానికి గాను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు కార్యదర్శులు నేడు ఇక్కడ సమావేశమైనారు.

సెకండరీ విద్యా విస్తరణ కార్యక్రమాల డైరెక్టరేట్ పై సమావేశాన్ని ఏర్పాటు చేసిన కేంద్ర విద్యా మంత్రి డాక్టర్ శ్రీమాలి సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశం రెండు రోజులపాటు జరుగుతుంది.

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ కె. జి. సైయిదేన్, విస్తరణ కార్యక్రమాల డైరెక్టర్ కుమారి ఎస్ పవన్‌స్కిర్, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

సెకండరీ పబ్లిక్ పరీక్షలలో పెక్కుమంది కృతార్థులు కాకపోవటాన్ని నివారించటానికి గాను ఉపాధ్యాయులు, విద్యార్థులు మరింత కృషి చేయాలనీ, తల్లి దండ్రుల సహకారం కూడా ఈ విషయంలో అత్యవసరమనీ శ్రీమాలి అన్నారు. పోలెడంత డబ్బు ఖర్చు చేస్తున్నప్పటికీ, విద్యాభివృద్ధికి పెద్ద కృషి జరుగుతున్నప్పటికీ సెకండరీ పబ్లిక్ పరీక్షలలో పెక్కుమంది తప్పిపోవటం చిత్రంగా ఉన్నదని ఆయన అన్నారు.

గత 30,40 సంవత్సరాలుగా పరీక్షా విధానాన్ని సంస్కరించాలను కొంటున్నప్పటికీ ఇంతవరకూ ఆ పని జరగలేదని ఆయన అన్నారు.

పెక్కుమంది విద్యార్థులు తప్పిపోవ

(మిగతా 4 వ పేజీలో)

సంగారెడ్డిలో సహకార సెంట్రల్ బ్యాంకు ప్రారంభోత్సవం

సంగారెడ్డి, సెప్టెంబర్ 21

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో సహకార పద్ధతిని విస్తృతంగా ప్రవేశపెట్టాలనుకోవటం లేదని ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి నేడు ఇక్కడ హామీ ఇచ్చారు.

సంగారెడ్డిలో జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్ కొత్త భవనాలకు ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో ఆయన పై విధంగా అన్నారు.

శాసన సభ్యుడు శ్రీ అచ్యుత రెడ్డి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు.

మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీ టి. ఎన్. కపూర్ ముఖ్యమంత్రికి స్వాగతమిచ్చారు.

రాష్ట్రంలో నమూనా యంత్రాల ఫ్యాక్టరీ

కేంద్రమంత్రి శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రి హామీ

హైద్రాబాద్, సెప్టెంబర్ 21

ఆంధ్రప్రదేశ్‌లో నమూనా యంత్రాల ఫ్యాక్టరీ స్థాపించే విషయమై కేంద్ర ప్రభుత్వం సానుభూతితో పరిశీలించ గలదని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రి రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పథకాలగురించి ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న సమయంలో శ్రీ శాస్త్రి పై హామీనిచ్చారు. ఆ చర్చలలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీ అనగాని భగవంతరావు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈరోజు విలేఖరులతో ముచ్చటిస్తూ శ్రీ భగవంతరావు ఆ సమావేశంలో చర్చకు వచ్చిన విషయాలలో ప్రాగాటుల్స్ ఫ్యాక్టరీ విస్తరణ, నమూనా యంత్రాల ఫ్యాక్టరీ స్థాపన, రాజమండ్రి పేపర్ మిల్లు విస్తరణ, మందుల ఉత్పత్తి కేంద్రం స్థాపన, ఎరువుల ఫ్యాక్టరీ స్థాపన మొదలగు అంశాలు ఉన్నాయని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నమూనా యంత్రాల ఫ్యాక్టరీ స్థాపనావశ్యకతను రాష్ట్రప్రభుత్వం కేంద్ర మంత్రికి నచ్చజెప్పినదని శ్రీ భగవంతరావుఅన్నారు. లఘు పరిశ్రమల అభివృద్ధికి ఇలాటి ఫ్యాక్టరీ చాలా అవసరం. ప్రస్తుతం మనదేశంలో ఇలాటి ఫ్యాక్టరీలు రెండే ఉన్నాయి. ఒకటి ఢిల్లీ సమీపంలో ఓఖ్లాలోను, రెండవది రాజ్‌కోట్‌లోను ఉన్నాయి. ఈ ప్రతిపాదనను సానుభూతితో పరిశీలిస్తామని శ్రీ శాస్త్రి హామీ ఇచ్చారట.

చౌరకు పిప్పితో న్యూస్‌ప్రింట్ (పత్రికల కాగితం) తయారు చేయటం సాధ్యమా అన్న విషయాన్ని పరిశీలించిన జర్మన్ నిపుణుల బృందం తమ నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించినదని శ్రీ భగవంతరావు అన్నారు. న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ స్థాపించటం సాధ్యం కానట్టయితే సాధారణ కాగితం ఫ్యాక్టరీ స్థాపించే విషయం ఆలోచించవచ్చునని కేంద్ర మంత్రి అన్నారట. రాజమండ్రి పేపర్ మిల్లు విస్తరణ పథకానికి తుది స్వరూపం ఇవ్వబడింది. ఉత్పత్తిని రోజుకు 10 టన్నులనుంచి 50టన్నులకు పెంచించాలని తలపెట్టబడింది.

రాష్ట్రంలో స్థాపించ దలచిన ఎరువులఫ్యాక్టరీకి అవసరమైన విదేశ మారకానికి సంబంధించినంతవరకు కొంత యెన్ రుణం, డాలర్ రుణం ఇంకా అందుబాటులో ఉన్నదని, దీనికయ్యే యంత్రసామగ్రిని ఖరీదు చేయటానికి ఆ రుణాలు వినియోగించుకోవచ్చునని కేంద్ర మంత్రి అన్నారట.

అంతర్జాతీయ న్యాయస్థానం సమావేశం

హేగ్, సెప్టెంబర్ 21

భారత దేశంపై పోర్చుగల్ దావాను విచారించటానికి గాను అంతర్జాతీయ న్యాయస్థానం నేడు భారత కాలమానం ప్రకారం రాత్రి 8-30 గంటలకు సమావేశమైనది.

పారిశ్రామిక అభివృద్ధి

ప్రగతి సంతృప్తికరం

లాల్ బహాదుర్ శాస్త్రి ప్రకటన

కర్నూలు, సెప్టెంబర్ 21

దేశంలో పారిశ్రామికాభివృద్ధి ప్రగతి సంతృప్తికరంగా ఉన్నదని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రి అన్నారు.

ప్రైవేట్ యాజమాన్యంలో స్థాపించబడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీకి నిన్న సాయంకాలం ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో శ్రీ శాస్త్రి పై విధంగా అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం సిమెంటు, చక్కెర, బట్టలు కొరతగా ఉన్న మన దేశం ఈ నాడు ఈ రంగాలలో స్వయం సమృద్ధిని సాధించటమే గాక విదేశాలకు ఎగుమతులు కూడా చేయ గల్గుతున్నదని ఆయన అన్నారు.

పారిశ్రామిక సంస్థల లాభాలకు గరిష్ఠ పరిమితి

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ పారిశ్రామిక సంస్థల లాభాలకు గరిష్ఠ పరిమితి నిర్ణయించాలని కోరారు. భూవసతికి గరిష్ఠ పరిమితి నిర్ణయిస్తున్నప్పుడు పారిశ్రామికులు ఇష్టం వచ్చినంత లాభం సంపాదించేటట్టు వదిలేయటం సమంజసం కాదని ఆయన అన్నారు. గరిష్ఠ పరిమితులకు ఒక వ్యవసాయ పరిశ్రమనే తీసుకోవటం న్యాయం కాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కూడా తాము ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరచినట్టు ఆయన చెప్పారు.

పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ ప్రస్తుతం రోజుకు 200 టన్నుల సిమెంటును ఉత్పత్తి చేయ గలదు. ఈ ఉత్పత్తిని మూడింతలు చేయటానికి అవకాశముంది.

శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రి నిన్న

(మిగతా 4 వ పేజీలో)

కృశ్చేవ్ పట్ల మర్యాద

వైట్ హౌస్ విజ్ఞప్తి

వాషింగ్టన్, సెప్టెంబర్ 21

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ పర్యటన సందర్భంలో ఆయన పట్ల మర్యాదగా ప్రవర్తించ వలసిందిగా "వైట్ హౌస్" నేడు విజ్ఞప్తి చేసినది.

వచ్చే వారాంతంలో డేవిడ్ క్యాంప్ వద్ద సోవియట్ ప్రధానితో నిర్మాణాత్మకమైన చర్చలు జరపగలనని అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఆశిస్తున్నట్టు వైట్ హౌస్ ప్రతినిధి శ్రీ జేమ్స్ హాగర్టీ వెల్లడించారు.

శ్రీ కృశ్చేవ్ పట్ల అమర్యాదకరముగా ప్రవర్తిస్తే నిర్మాణాత్మక చర్చలు జరిపాలనే లక్ష్యం సిద్ధించదని శ్రీ హాగర్టీ అన్నారు.

ముందు ప్రయాణం, తర్వాత డబ్బు

'ఎయిర్ ఇండియా' కొత్త పథకం

బొంబాయి, సెప్టెంబర్ 21

ముందు ప్రయాణం, తర్వాత డబ్బు చెల్లింపు అనే ఒక కొత్త రకం ప్రయాణాల స్కీమును విదేశాలకు ఉన్నత విద్యకై వెళ్ళే విద్యార్థుల సౌకర్యార్థం ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ వారు అక్టోబర్ 2వతేదీ నుంచి ప్రారంభిస్తారని ఆ సంస్థ వ్యాపార డైరెక్టర్ నేడిక్కడ వెల్లడించారు.

ఈ స్కీము క్రింద విదేశాలకు వెళ్ళదలచే వారు ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ ఆఫీసుకు గాని, దాని శాఖలకు గాని, ఇండియా బ్యాంక్‌కు గాని ముందుగా దరఖాస్తు వ్రాసి అసలు ఛార్జీలో అయిదో వంతు బయానా ఆ దరఖాస్తుతో పంపాలి. బ్యాంకు వారు దరఖాస్తుదారుని ఆర్థిక శక్తి స్తోమతులను విచారించి, మిగతా సొమ్ము ఎయిర్ యిండియా ఇంటర్నేషనల్ వారికి ప్రయాణీకుని ఖాతా క్రింద బ్యాంకు వారు చెల్లిస్తారు.

ఖాందేస్ వరదలలో 13 మంది మరణం

బొంబాయి, సెప్టెంబర్ 21

తూర్పు ఖాందేస్‌లో గత వారం వచ్చిన వరదలలో 13 మంది మరణించినట్టు అధికారికంగా తెలిసినది. మొత్తం 51 గ్రామాలు జలమయమైనాయి. సుమారు 50 లక్షల ఆస్తి నష్టమైంది. గ్రామస్థులే స్వయంగా సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రభుత్వం వరదదెబ్బతిన్న ప్రాంతాలలో చౌకడిపోలు ప్రారంభించినది.

తాజావార్తలు

న్యూయార్క్, సెప్టెంబర్ 21

ఇండియా ప్రతిపాదించిన చైనా పక్షత్వం విషయాన్ని చర్చనీయాంశాలలో చేర్చరాదని సార్వత్ర సంఘం చేసిన సిఫార్సుపై జనరల్ అసెంబ్లీ నేడు చర్చ ప్రారంభించినది.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో చెప్పుల యుద్ధం

కలకత్తా కాల్పులపై చర్చ సందర్భంలో అల్లరి, రభస

కలకత్తా, సెప్టెంబర్ 21

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో నేడు ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై మరొకరు చెప్పులు విసురుకొని గలభా జరిగిన కారణంగా సమావేశం మధ్యలో నిలిపి వేయబడినది.

కలకత్తాలో అల్లర్లకు సంబంధించి చర్చ జరుగుతున్న సందర్భంలో పై గలభా జరిగినది.

రాష్ట్ర పోలీస్ మంత్రి శ్రీ ముఖర్జీ ప్రసంగం ముగిసిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు చెప్పుల వర్షాన్ని కురిపించారు.

సభ్యులు బల్లలు గుద్ది గోల చేస్తుండటంవల్ల మంత్రి ప్రసంగంలో ఒక్క మాట కూడా సరిగ్గా వినిపించ లేదు.

సభను వాయిదా వేసిన తర్వాత కూడా కాంగ్రెస్, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై మరొకరు చెప్పులు విసురుకోవటం మాన లేదు.

అల్లరి జరిగినప్పుడు ముఖ్యమంత్రి డాక్టర్ బి. సి. రాయ్ సభలో లేరు.

సమావేశం నేటి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైనది.

లాబీలలో ఒక కమూనిస్టు సభ్యుడు మరో కాంగ్రెస్ సభ్యుడు జట్టూజట్టూ పట్టుకొని కొట్టుకొన్నారు.

అసెంబ్లీ భవనం మంద పది వేల మంది ప్రదర్శనలు చేసారు.

న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, సెప్టెంబర్ 21

నేటి ప్రారంభ ధర	32.24
నేటి ముగింపు ధర	32.35

చంద్ర మండలానికి అయస్కాంత క్షేత్రం లేదట

లూనిక్ ధృవ పరచిన విషయం

మాస్కో, సెప్టెంబర్ 20

గత వారాంతంలో రష్యా ప్రయోగించిన చంద్రమండల రాకెట్ తొలఫలితాలను మాస్కో రేడియో నేడు ప్రసారం చేసినది.

పరికరాలు కల్గిఉన్న కవచం, రాకెట్ చివరిదశ భాగము రెండూ కూడా చంద్రమండలంలో పరితలంపై దిగినాయని టాస్ ప్రకటించినది.

"ఇంతవరకు సేకరించబడిన తొలి సమాచారాన్ని బట్టి చూస్తే చంద్రమండలం పరిసరాలలో అయస్కాంత (ఆకర్షణ) క్షేత్రం ఉన్నట్టు కనిపించటం లేదు" అని ఆ ప్రకటన తెల్పినది.

రాకెట్ ప్రయాణం చేసిన మార్గానికి సంబంధించిన సమాచారాన్ని పరిశీలించి చూచినప్పుడు పరికరాల కవచం, రాకెట్ చివరి దశ భాగం చంద్రమండలాన్ని చేరుకొన్నట్టు తెలిసినదని టాస్ తెల్పినది.

పరికరాల కవచం, అరిస్టాటిల్, ఆర్కిమెడిస్, ఆపోలినియస్ అనే పర్వత శిలాల సమీపంలో ఉన్న శాంత సముద్రానికి తూర్పు భాగంలో దిగినదని తెల్పినది.

అక్కడ దినసమయానికి ఆ కవచం, చంద్ర మండల ఉపరితలానికి 60 డిగ్రీల కోణంలో సెకండుకు 3.3 కిలో మీటర్ల (2.05 మైళ్ళు) వేగంతో ప్రయాణిస్తున్నదట.

చంద్ర మండలానికి అయస్కాంత (ఆకర్షణ) క్షేత్రం లేకపోతే తత్ఫలితమేగాక దాని చుట్టూ రేడియేషన్ మండలం కూడా లేదని పరికరాలద్వారా తెలిసినట్టు ప్రకటన తెల్పినది.

(తొలుత ప్రయోగించిన ఉపగ్రహం ద్వారా తెలిసిన సమాచారాన్ని బట్టి భూమి చుట్టూ రెండు రేడియేషన్ మండలాలు ఉన్నాయి.)

చంద్ర మండలం లో మనకు కనపడని ప్రాంతపు కేంద్రానికి సుమారు 497 మైళ్ల దూరంలో ఆ కవచం పడిందని కూడా ప్రకటన తెల్పినది.

ప్రపంచ దేశాలలో త్వరలోనే చైనాకు ప్రథమ స్థానం

శాన్‌ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 21

చిట్టచివరకు ప్రపంచ దేశాలలో ప్రథమ స్థానాన్ని చైనా ఆక్రమించి తీరుతుందని శాన్‌ఫ్రాన్సిస్కో మేయర్ జార్జి క్రిస్టోఫర్‌కు రష్యా ప్రధాని నికిటా కృశ్చేవ్ నిన్నరాత్రి చెప్పారు.

తర్వాత విలేఖరులతో మాట్లాడుతూ కృశ్చేవ్ ఇలా చెప్పారని మేయర్ అన్నారు: "నేనునిర్మొహమాటంగా మాట్లాడుతున్నాను. ఇప్పుడు మీరు ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. కాని త్వరలోనే మీరు రెండవ స్థానానికి, చివరికి మూడవ స్థానానికి దిగక తప్పదు."

మరి ప్రథమ స్థానం ఎవరు ఆక్రమిస్తారని మేయర్ అడగగా చైనా అని కృశ్చేవ్ అన్నారట.

నిరాయుధీకరణపై జనరల్ అసెంబ్లీలో చర్చ

సోవియట్ రష్యా ప్రతిపాదన

న్యూయార్క్, సెప్టెంబర్ 21

"సంపూర్ణ నిరాయుధీకరణ" వ్యవహారాన్ని జనరల్ అసెంబ్లీ చర్చలో చేర్చాలని రష్యా నేడు అధికారికంగా ప్రతిపాదించినది.

ఈ వ్యవహారం "ముఖ్యమైనదనీ, అత్యవసరమైనదనీ" రష్యా విదేశాంగ మంత్రి శ్రీ గ్రోమికో అసెంబ్లీ పత్రంగా వెలువరించిన ప్రకటన పత్రంలో విజ్ఞప్తి చేసారు. ప్రస్తుతం ఆయుధ సేకరణలో జరుగుతున్న పోటీని బట్టి, వెనుకటి సందర్భాలను బట్టి నిరాయుధీకరణ సమస్యను వెంటనే పరిశీలించటం అవసరమని ఆయన కోరారు. ఆయుధాల పోటీ ప్రపంచ శాంతి పరిరక్షణకు ప్రమాదకరంగా పరిణమించినదని ఆయన పేర్కొన్నారు.

అణ్వస్త్రాలు అమర్చిన రాకెట్లు నిర్మించటం, ఇతర దేశాలలో కొన్ని దేశాలు రాకెట్ స్థావరాలను నెలకొల్పటం వల్ల వినాశకర మారణ యుద్ధానికి దోహదం చేకూరినదని ఆయన పేర్కొన్నారు.

విశ్వావసు సంవత్సరం
మంగళవారం, సెప్టెంబర్ 22, 1959
భాద్రపద బహుళ పంచమి
పంచమి ఉ॥ 11-27
కృత్తిక రా॥ 9-57
వర్జ్యం ఉ॥ 8-42 మొ॥ 10-28 కు

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు: 4950

మంగళవారం, సెప్టెంబర్ 22, 1959

కృశ్చేవ్ పథకం

సోవియట్ ప్రధాని శ్రీ

కృశ్చేవ్ అసలు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించటమే ఒక గొప్ప విషయం. ప్రపంచంలో నిజంగా అగ్ర రాజ్యాలన దగిన రాజ్యాలలో ఒక దాని అధినేతగా ఆయన ప్రపంచ సంస్థలో చేసిన ప్రసంగానికి అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రత్యేకించి ఈవరుణంలో దానికి ఇంకా ఎక్కువ ప్రాముఖ్యం ఉన్నదని ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు. ప్రముఖ నాయకులు తరుణానికి తగిన ప్రసంగం చెయ్యాలని తహతహలాడటం సహజం. పూర్వం అమెరికా అధ్యక్షుడు శ్రీ ఐసెన్‌హోవర్ ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించి నప్పుడు శాంతియుత ప్రయోజనాలకై అణుశక్తిని వినియోగించే విషయమై చరిత్రాత్మకమైన ఒక పథకాన్ని ప్రతిపాదించి, పెద్ద సంచలనం కలిగించారు. ఇప్పుడు శ్రీ కృశ్చేవ్ కూడా అటువంటి ప్రతిపాదనలు చేయటానికి ప్రయత్నించారు.

నాలుగేళ్లలో ప్రపంచంలోని సమస్త దేశాలు పూర్తిగా అస్త్ర సన్యాసం చెయ్యాలని శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదించారు. రాకెట్లు, అణ్వస్త్రాలు మొదలైన యుద్ధ పరికరాలను పూర్తిగా విసర్జించాలని, సైన్యాలను పూర్తిగా రద్దు చేయాలని శ్రీ కృశ్చేవ్ సూచన. ఇది నిజంగా పెద్ద సంచలనం కలిగించింది. అయితే, అది ఆ సూచనలో గల విశేషం వల్ల కాదు. శ్రీ కృశ్చేవ్ ఆ సూచన చెయ్యటం వల్ల సంచలనం కలిగించే గుణం దానికి అబ్బినది.

నాలుగేళ్లలో పూర్తిగా నిరాయుధీకరణను సాధించాలనటంలో శ్రీ కృశ్చేవ్ ప్రపంచ ప్రజలు గాఢంగా కాంక్షిస్తున్న విషయాన్నే వ్యక్తీకరించారు. ఆ యుధ విసర్జన జరగాలని కోరని వారెవరు? ప్రచ్ఛన్న యుద్ధంతో విసుగెత్తని వారు, ప్రత్యక్ష యుద్ధం అంటే భయపడని వారు అరుదు. ఆయుధాల పోటీని కొనసాగించటం మూర్ఖత్వం తప్పించి వేరొకటి కాదని అంతా అంగీకరిస్తూనే ఉన్నారు. హైడ్రోజన్ బాంబు కంటె శక్తిమంతమైన మారణాయుధాన్ని ఊహించటం కష్టమని శ్రీ కృశ్చేవ్ అన్నారు. అక్షరాలా నిజం. ప్రపంచాన్ని పూర్తిగా దగ్ధం చేయటానికి ఇప్పుడున్న ఆయుధాలు, రాకెట్లు చాలు. అందుచేత, అస్త్రాలను పదును పెట్టడం, వాటిని మరీ ఎక్కువగా ఉత్పత్తి చెయ్యటం, యుద్ధాల కోసం పెద్ద పెద్ద సేనలను తయారు చెయ్యటం అర్థంలేని పనులు. వీటి వల్ల ప్రపంచంలో ఉద్రిక్తత, భయాందోళనలు చెలరేగటం తప్ప, శాంతి సాధనకు అవి ఎందుకూ పనికిరావు. పైగా ఇప్పుడు తయారౌతున్న మారణాయుధాలను తలుచుకుంటేనే నరాలు తెగిపోతుంటే, ఇక వేరే యుద్ధాలు జరగాలా? ఈ పరిస్థితిని అంతమొందించటానికి కృషి చేయటం అగ్ర రాజ్యాల ప్రధాన కర్తవ్యం అనటంలో సందేహం లేదు.

నిరాయుధీకరణ జరగాలనటానికి మరొక కారణం కూడా ఉన్నది. దీనిని సాధించనంత పరకు ప్రపంచంలో దారిద్ర్యాన్ని నిర్మూలించటం అసంభవం. ప్రపంచం మొత్తం మీద ప్రస్తుతం ఆయుధాలకు, సైన్యాలకు ఏటా 10 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నట్టు శ్రీ కృశ్చేవ్ అంచనా వేసారు. ఇది శుద్ధ దండుగ ఖర్చు. ఈ ధనాన్ని బడుగు దేశాల అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపుదలకు వినియోగిస్తే పుణ్యం, పురుషార్థం ఉంటుందని ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు. బడుగు దేశాల అభివృద్ధికి శాయశక్తులా సహాయపడాలని, సోవియట్ యూనియన్ ఈ విషయంలో యథోచితంగా సహకరించగలదని శ్రీ కృశ్చేవ్ అన్నారు. ఆయన ఇచ్చిన హామీ పట్ల ఆసియా, ఆఫ్రికా వర్గాల వారు హర్షాన్ని ప్రకటించారు. అయితే, వెనుక బడిన దేశాల అభివృద్ధికి ఆర్థిక, సాంకేతిక సహాయం అందజేయటం అన్నది కూడా ఒక పోటీగా -అంటే అగ్రరాజ్యాలు ఒక దానినొకటి దెబ్బతీయటానికి తలపెట్టిన చర్యగా-పరిణమించినది. దీనికంతకీ మూల కారణం ఉభయ కూటాల వారు ఒకరి నీడ చూసి ఒకరు భయపడటమే. శాంతియుత సహజీవనం విషయంలో ఉభయ పక్షాలకు చిత్త శుద్ధి ఉన్నట్లయితే, అట్టి విశ్వాసం వారికి కలిగినట్లయితే, ఆయుధాల విషయంలోగాని, ఆర్థిక సహాయం విషయంలో కాని అవాంఛనీయమైన పోటీలకు తావుండదు. ఆర్థిక సహాయం విషయంలో పోటీ పడటం వల్ల ప్రమాదం లేదు. నిరాయుధీకరణ ఇందుకు దోహదం చేస్తుంది కనుక, దానిని సాధించటంలో అగ్ర రాజ్యాలు ఏమాత్రం ముందుకు వెళ్ళగలిగినా అది హర్షదాయకమే కాగలదు. సమస్త దేశాలు నాలుగేళ్ళలో అస్త్ర సన్యాసం చెయ్యాలని శ్రీ కృశ్చేవ్ అనటం ప్రచారం కోసం ప్రాకులాడటమే కావచ్చు. కాని ఆయన చేసిన ప్రతిపాదనలు నిరాయుధీకరణ చర్చలకు ప్రాతిపదికగా పనికి రాగల వనట లో సందేహం లేదు.

ఐదుగురు భారతీయుల అరెస్టు

పాకిస్తానీయుల చర్య

కలకత్తా, సెప్టెంబర్ 19

ముర్షిదాబాద్ నుంచి బైష్ణవ్‌నగర్‌కు 2,000 బీడీ ఆకు బస్తాలను తీసుకొని వెడుతున్న ఐదుగురు భారతీయులను, వారి పడవను పాకిస్తానీ పోలీసులు పట్టుకొన్నట్టు ఇక్కడికి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

సుమారు 8,000 రూపాయలు విలువ చేసే ఆకు కూడా స్వాధీన పరచుకొన్నారట. రాజ్‌షాహి డివిజన్‌లో నీంటీటా అనేచోట ఆ పడవ పాకిస్తాన్ జలాలలో ప్రవేశించినదని వారు ఆరోపించారు.

ముర్షిదాబాద్ జిల్లా మేజిస్ట్రేట్, రాజ్‌షాహి జిల్లా మేజిస్ట్రేట్‌కు తీవ్ర ఆక్షేపణలు తెలియజేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 18

హైదరాబాద్ గుమస్తా సంఘం ప్రధాన కార్యదర్శి పేరు శ్రీ పుజారి వాసుదేవ్ కు బదులు పెండెం వాసుదేవ్ అని పొరపాటున 17వ తేదీ ఆంధ్ర జనతలో పడింది.

ధ్వని-ప్రతిధ్వని

గర్భగుడిలో అపచారం!

పూర్వం మొగల్ యుగంలో న్యాయం కోరుతూ సింహద్వారం వద్ద గంట మ్రోగించిన వారెవరికైనా జహాంగీర్ దర్శన మిచ్చి, వారి మొర ఆలకించేవాడట. దానిని న్యాయ గంట అనే వారు. నేటి మన ప్రజాస్వామిక యుగంలో (ఇతర రాష్ట్రాల మాట ఏమోకాని) ఆంధ్ర ప్రదేశ్‌లో (నాటి) న్యాయ గంట స్థానాన్ని మంత్రి బంట్రోతు తీసుకొన్నట్టు కనిపిస్తున్నది.

సినీమా తార ప్రక్కనుంచి చూసుకు పోతే, కాలేజి కుర్రాడు ఎంత పరవశుడై పోతాడో, మంత్రి గారి సమక్షంలో మూడు ఝుణాలు గడిసితే, జన్మ తరించినట్టు భావించే వారు చాలా మంది ఉన్నారు. పైగా, మంత్రిగారిని కలుసుకుంటే ఎంత గౌరవం, ఎంత ఘనత! పని చిన్నదైనా, చిటారు కొమ్మన కూర్చునే అధికారిని కలుసుకొనే తత్వం మనలో చాలా మందికి ఉన్నది. ప్రజాస్వామ్యంలో మంత్రుల కుర్చీలే సింహాసనాలు. ప్రజామంత్రులు కాబట్టి ప్రజల కోర్కెలను మన్నించక తప్పదు. మంత్రి ఆయువు పట్టు ప్రజల ఓటు. ఓటు రాకపోతే బోటు తలక్రిందు లౌతుంది. ప్రజలంటే అభిమానం వల్ల కాకపోయినా, ఓట్ల కోసమైనా ప్రజా ప్రతినిధులకు దర్శన మివ్వక తప్పదు. ప్రజల తహతహ వల్లనైతేనేమి, మంత్రుల వైఖరివల్లనైతేనేమి, మన మంత్రులను, ముఖ్యంగా ఆంధ్ర మంత్రులను కలుసుకొనటానికి రోజూ తండోప తండాలుగా జనం వెడుతున్నారు. ఈ తీర్థ ప్రజకు సమాధానం చెప్పటం కష్టమే. అందరికీ ఏక కాలమందే దర్శన మివ్వటం అసంభవం కనుక, ముందు వెనుకలు నిర్ణయించటం తప్పని సరి. ఈ విషయంలోనే చాలా కుంభకోణం జరుగుతున్నట్టు, ఈ కుంభకోణంలో మంత్రిగారి బంట్రోతు ప్రముఖ పాత్ర వహిస్తున్నాడని లోకులు అనుకోగా, ఆ విషయం నా దాకా కూడా పడింది.

మంత్రుల బంట్రోతులు మంత్రులను చూడటానికి వచ్చిన వారిని నిలవేసి మామూళ్లు వసూలు చేస్తున్నారని ఇటీవల రెండు మూడు సార్లు ఇద్దరు, ముగ్గురు మంత్రుల వద్దకు వెళ్లి వచ్చిన ఒక పెద్ద మనిషి చెప్పేసరికి, నిజంగా నేను నమ్మలేక పోయాను. గర్భగుడిలోనే అపచారమా? ఎంత ఘోరకలి? మంత్రులకు ఈ విషయం తెలియదు. తెలస్తే వారు ఊరుకోరని మనకు ఖచ్చితం. కాని వారి బంట్రోతులుమామూళ్లు వసూలు చేయగలుగు తున్నారన్న విషయం ముమ్మాటికీ నిజం. మంత్రి గారికి చీటీలు (విజిటింగ్ కార్డులు) తీసుకు వెళ్ళేది బంట్రోతులే. అందుచేత వీరిని ప్రసన్నులను చేసుకొనటం పైనే మంత్రిగారి దర్శనభాగ్యం లభించటం, లభించకపోవటం అన్నది ఆధారపడి ఉంటుంది. ముడుపు చెల్లించు కొనటం తప్పని సరి అయినప్పుడు, పిండి కొద్దీ రొట్టె అన్న సూత్రం పనిచేసి తీరుతుంది.

ఫలానా వ్యక్తికి ఎంత త్వరగా మంత్రిగారి దర్శన భాగ్యం లభిస్తుందనేది కొంత వరకు మంత్రిగారు పాటించే తరం, తమ భేదాలను బట్టి కూడా ఉంటుంది. ముందు వచ్చిన వారికి ముందు పడ్డించాలన్న సూత్రం ఇక్కడ పని చెయ్యదు. ఎంత కాదన్నా, మంత్రి మొదట రాజకీయ వాది, ఆ తర్వాత మరొకటీను. రాజకీయ నాయకుడుగా ఆయనకు అనేక మొహమాటాలు ఉంటాయి, ఆ మొహమాటాలలో కూడా పెద్ద, చిన్న ఉంటాయి. అందర్నీ ఏక పంక్తిని, ఏక కాలమందే కూర్చోపెట్టి భోజనం చెయ్యమంటే, ఆయన చెయ్య లేడు. పైగా మరొక విషయం. మనం మామూలుగా ఫలానా వస్తువు ఇన్ని రూపాయలని లెక్క వేసి, దాని విలువ నిర్ణయం చేసినట్లే, ఫలానా వ్యక్తి ఎన్ని ఓట్ల పెట్టు అని లెక్కవేసి, మంత్రులు వ్యక్తులకు విలువ కడతారు. ఓట్ల రీత్యా ఆస్థి ఖరీదు చెయ్యని వ్యక్తులు ఆ మందలో గంటల తరబడి పడిగాపుల పడ వలసి ఉంటుంది. మంత్రి ప్రాంగణం రైల్వేలు, సినీ మాలు (ఇప్పుడు) చక్కెర దుకాణాలు మున్నగు తావులవద్ద ఉంటేర్యూలను జ్ఞప్తికి తెస్తున్నదని అంటున్నారు. మంత్రులతో పని తగిలి రెండు, మూడుసార్లు వెళ్ళగా, అప్పుడు కలిగిన అనుభవం వల్ల, మళ్లీ వెళ్లవలసి వచ్చినప్పుడు ఒక బెడ్డింగ్, రెండు, మూడు పుస్తకాలు తీసుకు పడితే మంచిదని ఒక ఆసామి చమత్కరించాడట!

అయితే, మంత్రుల పైము చాలా విలువైనది కనుక, వచ్చిన వాళ్ళందరితోనూ మాట్లాడటం సాధ్యం కాదు. ఇంటర్వ్యూలకు అనుమతి ఇవ్వటం విషయంలో వారు ఎట్టి మొహమాటాలను పాటించ రాదనటం కూడా అనుచితమే. అయితే, వారు ఈవిషయంలో కొన్ని కచ్చితమైన సూత్రాలను, పద్ధతులను నిక్కచ్చిగా అనుసరించినట్లయితే, వారికీ, వారిని చూడవచ్చే వారికీ కూడా ఎంతో హాయి ఇంటర్వ్యూలకు కచ్చితంగా ముందుగానే పైము నిర్ణయిస్తే, ఖాతా జాతికి ప్రస్తుతం జరుగుతున్నట్టి అపార పని గంటల నష్టం సంభవించకుండా ఉంటుంది.

ఇంటర్వ్యూలు కోరుతూ వచ్చేవారు మంత్రులతో సహకరించటానికి బోలెడంత అవకాశం ఉన్నది. వారు సమయా సమయాలు కనిపెట్టిమసలుకోవాలి. వచ్చిన పని ఏమిటో ముగించుకొని వెళ్ళిపోవటం వారు అలవాటు చేసుకోవాలి. మెడపెట్టి గెంటేసే వరకు జిడ్డులా పట్టుకోకూడదు. తను చూడటానికి వచ్చిన పెద్ద మనిషి ముంచిపనిలోఉన్నా త్వాస్థింలా నిలబడకూడదు.

—"కూచిమంచి"

టిబెటన్లకు ఆశ్రయం

ఇండియా నైతిక బాధ్యత అని శ్రీ భావే ఉద్ఘాటన

జమ్మూ, సెప్టెంబర్ 21

టిబెట్ కాందిశీకులకు ఆశ్రయమివ్వటం భారత దేశపు నైతిక విధియని యిక్కడకు 54 మైళ్ల దూరంలో ఉన్న కథువా గ్రామంలో నిన్న సాయింత్రం జరిగిన ఒక బహిరంగ సభలో ఉపన్యసిస్తూ ఆచార్య వినోబా భావే అన్నారు.

టిబెట్ కాందిశీకులకు ఆశ్రయమివ్వటంలో బుద్ధుని ధర్మసూత్రాలనే భారత దేశం అనుసరించింది.

ఈ దేశంలో పుట్టి, పెరిగి, ప్రపంచానికి ప్రేమ, సేవ సందేశాల నందించిన బుద్ధునిసూత్రాలకు వ్యతిరేకమైనచో టిబెటన్లకు భారతదేశం ఆశ్రయమిచ్చి వుండేది కాదు. అదీగాక ఇది మానవ సేవా సమస్యేగాని దీనిలో రాజకీయోద్దేశాలేమీ లేవని శ్రీ వినోబా వైనీయులకు హామీ యిచ్చారు.

జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో నాల్గు మాసాల పాదయాత్రను ముగించి, నేడు తిరిగి పంజాబ్ పాదయాత్రకై బయలుదేరి వెళ్ళారు. కాశ్మీర్ స్టేటుకు ద్వారం అనదగు లక్కన పూర్ వద్ద కాశ్మీర్ మంత్రులు, కాంగ్రెసు, సర్వోదయ నాయకులు, అధికార, అనధికారులు శ్రీ వినోభాకువీడ్కోలిచ్చారు

చెట్టు మీద శిశు జననం

సూరత్, సెప్టెంబర్ 20

వరదలలో ప్రాణాలు రక్షించుకోవటానికి చెట్టుమీదికి ఎక్కిన ఒక గర్భవతి నిన్నటిదినం అక్కడే ఒక చిటారు కొమ్మమీద ప్రసవించినది. సూరత్ ఆవలివైపు ఒడ్డుమీద ఉన్న ఒక చిన్న టౌన్‌లో వరదలు ముంచెత్తటం వల్ల ఆమెతో పాటు, ఆమె కుటుంబంలోని వారంతా సమీపంలోని ఒక చెట్టును ఆశ్రయించారు. నొప్పులు ప్రారంభం కావటం తోటే మంచంలా ఉపయోగిస్తున్న చిక్కాన్ని ఆమె వెంట వచ్చిన మిగతా కుటుంబీకులు చెట్టు పై భాగం మీద జాగ్రత్తగా ఒక చోట బిగించి ఆమెను పడుకోపెట్టారు.

వరదలు మహోగ్రతంగా ఉన్న సమయంలో కొత్తగా ఒక పసిబిడ్డ ప్రపంచంలో అడుగు పెట్టాడు.

మాతా శిశువులు క్షేమం.

కుజ, శుక్ర గ్రహాలకు రాకెట్

రష్యాకు సాధ్యమేనని శాస్త్రజ్ఞుని ప్రకటన

హాంకాంగ్, సెప్టెంబర్ 20

అంగారక, శుక్ర గ్రహాలకు రాకెట్లను పంపగల శక్తి రష్యన్లకు ఉన్నదని ఎకడ మీషియన్ ఎఫ్‌గినీ ఫెడరోవ్ చైనీస్ అధికార వార్తాసంస్థ సిన్‌హువాకు చెప్పినట్టు మాస్కో రేడియో ప్రకటించినది. అలాటి రాకెట్లు అందుకోవలసిన వేగాన్ని, వాటి కుండవలసిన బరువు, శక్తిని సాధించగల శక్తి రష్యన్లకు ఉన్నదని ఆయన అన్నారట.

అయితే చంద్రమండలానికి పంపిన రాకెట్ కంటే అలాటి వాటికి చాలా ఖచ్చితంగా నడిచే వాహక రాకెట్లు అవసరమని ఆయన అన్నారు. మొన్నటి రాకెట్ విజయాన్ని బట్టి చూస్తే చంద్రమండలానికి ఇతర రకెట్లను పంపటం కూడా సాధ్యమేనని తెలుస్తున్నదని ఆయన అన్నారు.

లూనిక్ కంటె ఎక్కువ బరువు కల రాకెట్లను ప్రయోగించగల శక్తి రష్యా ఇది వరకే సంపాదించినది అని ఆయన అన్నారు.

మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు తాత్కాలిక సహాయం

భోపాల్, సెప్టెంబర్ 20

తాత్కాలిక సహాయంగా కరువు భత్యం అయిదు రూపాయలు మాత్రమే కష్ట ప్రభుత్వం పెంచినదానికి అసంతృప్తి సూచకంగా సెప్టెంబర్ నెల జీతాలు మామూలు ప్రకారం అక్టోబర్ 1 వ తేదీన తీసుకోలేదని మధ్యప్రదేశ్ ఖూజద తరగతి ఉద్యోగగణం నేడు నిర్ణయించుకున్నారు.

సెక్రటేరియట్ సిబ్బంది, రాష్ట్రీయ సిబ్బంది సంఘాల సంయుక్త సమావేశంలో పై నిర్ణయం జరిగింది. ఈ ఐదు రూపాయల కరువుభత్యం పెంపుగూడా మొత్తం అంతా కలిపి నెలకు రు. 195 లోపు జీతం వచ్చేవాళ్లకే లభించుతుంది. అంటే మొత్తం సిబ్బందిలో 10 లేక 15 శాతం ఉద్యోగులు మాత్రమే దీని ప్రయోజనం పొందగలరని సమావేశంలో ఆమోదించిన ఒక తీర్మానంలో పేర్కొన్నారు.

యుద్ధాన్ని తలపెట్టడం ఈ రోజుల్లో శుద్ధ వెర్రితనం

టెహరాన్ యూనివర్శిటీ సభలో శ్రీ నెహ్రూ ఉద్ఘాటన

టెహరాన్, సెప్టెంబర్ 21

వెనుక బడిన దేశాలు, పురోగామి దేశాల మధ్య వున్న అంతరం తగ్గిపోవాలని టెహరాన్ విశ్వవిద్యాలయం వారిచ్చిన "డాక్టరేట్ పట్టాన్ని" స్వీకరిస్తూ ఆసందర్భంలో జరిగిన సభలో భారత ప్రధాని శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేడిక్కడ అన్నారు.

"పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించుకున్న పురోగామి దేశాలు, తేలికగా వెనుకబడిన దేశాలను దోపిడీ చేయగలవు కాబట్టి ఆర్థికంగా వెనుకబడిన దేశాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

"మనది సాంకేతిక యుగం. ఎంతటి తెలివి తక్కువ వాడైనా యింజను నడపవచ్చు. పరాయివారిని అనుకరించకుండా, మన యంత్రాలను మనం తయారు చేసుకొనటం నేర్చుకోవాలి."

ఒక టెలివిజన్ యింటర్‌వ్యూలో మాట్లాడుతూ ప్రజలు చిత్తశుద్ధితో యుద్ధం రాకుండా చూసుకోవాలి లేదా యుద్ధమే వారినిలోకం నుంచి తొలగిస్తుందన్నారు శ్రీ నెహ్రూ. యుద్ధాలకు కారణాలైన ఈర్ష్య, భయం, యితర భూభాగాలు, ప్రజలపై పెత్తనం పొందాలనే స్వార్థ పరత్వం తొలగింప బడాలి. ఈ కాలంలో యుద్ధ మనటం శుద్ధ వెర్రితనమవుతుందన్నారు శ్రీ నెహ్రూ.

ఇరాన్-భారత దేశాల మధ్య సాంస్కృతిక, వర్తక, వాణిజ్యరంగాలలో సాన్నిహిత్యం మరింతగా పెంపొందించుకోవాలన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 21

ప్రాంతీయ కొనుగోలు సలహా సమితి సభ్యుల గౌరవార్థం ఆంధ్ర ప్రదేశ్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ వారు 25వ తేదీ సాయంత్రం లకు రిడ్జ్ హోటల్‌లో తేనీటి విందు యిస్తారు.

చెన్నూరు తాలూకాలో వెయ్యి యిండ్లు నేల మట్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 21

నేడిక్కడకు అందిన సమాచారము బట్టి అదిలాబాద్ జిల్లా చెన్నూరు తాలూకాలో ఇటీవల వర్షాలు, వరదల వల్ల 23 గ్రామాలు బాగా నష్టపడ్డాయని, వెయ్యి యిండ్లు కూలిపోయాయని తెలుస్తోంది.

శాసన పరిషత్తు సభ్యులు శ్రీ గంగారాం నిర్వాసులైన ప్రజానీకానికి ప్రభుత్వం సత్వర సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో వ్యభిచార నిర్మూలన

హైదరాబాద్, సెప్టెంబర్ 20

గత రాత్రి గౌలీగూడాలోని వడ్డు గృహాలపై దాడి చేసి 10 మంది యువతులను, ముగ్గురు పురుషులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు ఆపరేషన్ కమీషనర్ పెద్దారెడ్డి, సర్కిల్ యస్. నాయుడుగారల ఆధ్వర్యాన్ యీ దాడి జరిగింది. వ్యభిచార నిరోధ చట్టం 17 సెక్షన్ క్రింద పోలీసులు దాఖలు చేశారు.

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

టెండరు ప్రకటన

దిగువ తెలిపిన పనులకు సీలువేసిన టెండర్లు 1959 అక్టోబర్ 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు జనరల్ మేనేజర్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం కాలరీస్ పోస్ట్, (ఆం. ప్ర.) వారికి చేరేలా తీసుకొనబడి, 1959 అక్టోబర్ 19 వ తేదీన తెరువబడును.

పని పేరు	ఖర్చు రమారమి రు.	బయానా మొత్తం రమారమి ఖర్చులో 1% రు.	పని పూర్తి చేయటానికి వ్యవధి
రామగుండం థెర్మల్ స్టేషన్ నుంచి గనుల వద్దకు పోయే రోడ్డులో 6వ మైలు వద్ద వంతెనలకు సిల్లవంతెన (కల్వర్టు) లను నిర్మించుట.	1,50,000/-	1,500/-	టెండరును స్వీకరించిన తేదీ నుంచి 6 నెలలు

బయానా మొత్తాన్ని రొక్కంగా గాని, ప్రభుత్వ సెక్యూరిటీల రూపంలో గాని కొత్తగూడెం కాలరీస్‌లో ఉన్న కంపెనీ పే-మాస్టర్ వద్ద లేక బెల్లంపల్లిలో ఉన్న తాండూరు కాలరీస్ ఏజంటు వద్ద గాని డిపాజిట్ చేసి సదరు రశీదును టెండరుతో బాటు జతపరచి పంపాలి. ఈ విధంగా పంపని టెండరు తీసుకోబడదు.

ఎన్నుకోబడిన టెండరరు ఉజ్జాయింపు ఖర్చు మీద 1% మొత్తాన్ని అదనంగా ఎగ్రిమెంటు బాండును సంతకం చేసేటప్పుడు చెల్లించాలి.

టెండరు ఫారములు, ప్లాన్లు, స్పెసిఫికేషన్లు, పరిమాణములు, షెడ్యూలు సింగరేణి కోలిరీస్ లోని కంపెనీ పే-మాస్టరు నుంచి గాని, బెల్లంపల్లిలో ఉన్న తాండూరు కాలరీస్ ఏజంటు నుంచి గాని, హైదరాబాద్‌లో, ఖైరతాబాద్ మెహర్ మంజిల్‌లో ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సెక్రటరీ నుంచి గాని సెట్టుకు రు. 5/- చెల్లించి పొందవచ్చును.

కారణం చూపకుండా ఏ టెండరునైనా పూర్తిగా లేక అందులో కొంత భాగాన్ని స్వీకరించడానికి, వేటినైనా లేక అన్నిటినీ తృణీకరించడానికి జనరల్ మేనేజరుకు సర్వ హక్కులు ఉన్నవి.

జనరల్ మేనేజర్
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
కొత్తగూడెం కాలరీస్ పి.ఓ (ఆం.ప్ర.)

రైలు దిగి సామాన్యులతో సంభాషణలు

అమెరికన్ పోలీసులకు చికాకు కల్గిస్తున్న కృశ్చేవ్ చర్యలు

కృశ్చేవ్ ప్రయాణిస్తున్న రైలు, సెప్టెంబర్ 20:-

రష్యా ప్రధాని నికిటా కృశ్చేవ్ నేడు తమ భద్రతాధికారుల నిర్బంధంలో నుంచి బయటపడి శాన్‌ఫ్రాన్సిస్కో దారిలో రైలు ఆగిన ప్రతి చోటా అమెరికన్లతో ముఖా ముఖిగా సంభాషణలు జరిపారు.

శాంతా బార్బరాలో రైలు ఆగినప్పుడు సుమారు 8 వేల మంది అమెరికన్ ప్రజలు ఎంతో ఉత్సాహంతో కరతాళ ధ్వనులు, హర్ష ధ్వానాలుచేస్తూ ఆయనకు స్వాగతం చెప్పారు. అక్కడ మేయర్ ఎడ్వర్డు ఆబ్బట్‌తో ముచ్చటిస్తూ కృశ్చేవ్ లాస్ ఏంజిల్స్‌లో తమ గదిలో నుంచి బయటకు వెళ్ళలేదని, ఎవరిని కలవలేదని అన్నారు.

జనం దగ్గరకు వెళ్ళకుండా భద్రతాధికారులు ఆయనను ఆపటానికి ప్రయత్నించినప్పటికీ లెక్కచేయక కృశ్చేవ్ ముందుకు వెళ్ళి అనేక మందితో కరచాలనం చేశారు.

సాన్‌లూయిస్ ఆబిస్పో స్టేషన్‌లో కూడా కృశ్చేవ్ భద్రతాధికారుల కన్ను గప్పి జనసమూహం చొరబడి తను చుట్టూ మూగిన ప్రజలతో సంభాషణలు జరిపారు.

తమ ప్రత్యేక రైలులో ఒక పత్రికా విలేఖరుల గోష్ఠిలో ముచ్చటిస్తున్న కృశ్చేవ్ లాస్ ఏంజిల్స్‌లో తమకు లభించిన సన్మానాన్ని బట్టిచూస్తే తాను ఆతిథ్యమిచ్చేవారికి భారంగా ఉన్నానా అన్న అనుమానం కల్గిందని చెప్పారు.

"మంచి వాడైన అతిథి భారంగా పరిణమించటానికి ఎన్నటికీ అంగీకరించడు. ఆతిథ్య మిచ్చేవారు వెళ్లిపొమ్మని అనేవరకు ఉండటం కన్న ఓ ఐదు నిమిషాలు ముందుగానే వెళ్ళిపోవటం తుంచిది" అని ఆయన అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"శాంతా బార్బరాలో ప్రజలను కలుసుకోవటానికి అవకాశ మిచ్చినందుకు నాకు ఎంతో సంతోషం కల్గింది. నాకు అంతకంటే ఎక్కువ ఆనందం కల్గించినవేమిటంటే "గృహ నిర్బంధం" తొలగిపోయింది. వారిని ముఖాముఖి చూడటానికి నాకు అవకాశ మిచ్చారు.

"అంతకుముందు వారు మాకు నిద్ర పోవటానికి, తినటానికి మాత్రమే అవకాశమిచ్చారు-అయితే వారు మాకు చాలా మంచి తిండి పెట్టారు."

క్యాబట్ లాడ్జి వివరణ

కృశ్చేవ్ పర్యటనలో ఆయనకు తోడుగా వెడుతున్న ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి వర్గం నాయకుడైన శ్రీ హెన్రీ క్యాబట్ లాడ్జి విలేఖరులతో ముచ్చటిస్తూ కృశ్చేవ్ తమకు భారమేమీకాదని, "ఆయన మా మధ్య ఉండటం మాకెంతో సంతోషదాయకంగా ఉన్నదని" అన్నారు.

"గృహనిర్బంధం" అనే పదం కృశ్చేవ్ తమాషాకే ఉపయోగించినప్పటికీ, ఆయనను కాపాడటానికి తీసుకోబడిన భద్రతా ఏర్పాట్లను వర్ణించటానికి తగిన పదం కాదని ఆయన అన్నారు.

శాంతా బార్బరా మేయర్ అబ్బట్‌కు స్నేహమున్న పదానికి అర్థమేమిటో లాస్ ఏంజిల్స్ మేయర్ నోరిస్ పోల్సన్ కన్న బాగా తెలుసునని కృశ్చేవ్ అన్నారు.

(లాస్ ఏంజిల్స్ మేయర్ విమర్శకు పురస్కరించుకొని కృశ్చేవ్ తమ పర్యటన రద్దు చేసుకొని తిరిగి వెళ్లిపోతానని బెదిరించిన సంగతి పాఠకులకు విదితమే.)

అయితే కృశ్చేవ్ ఈ రోజున నవ్వుతూ ఆనందంగా కన్పించారు వెళ్లిపోతానన్న మాటలను ఆయన మళ్లీ ఎప్పుడూ అన లేదని ఆయన వెంట ఈ కాలిఫోర్నియా కోస్తా పర్యటన చేస్తున్న విదేశాంగ శాఖ అధికారులు అన్నారు

వస్త్రాలలోని చెమ్మను కొలిచే సాధనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20

టెక్స్‌టైల్సు, కాగితం మొదలైన వాటిలో చెమ్మ ఎంతవున్నదీ ఖచ్చితంగా కొలిచే ఒక యంత్రాన్ని ఢిల్లీలోని శ్రీరామ్ పారిశ్రామిక పరిశోధన సంస్థ తయారు చేసింది.

విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఈ మాదిరి యంత్రం కంటె ఇది ఎంతో మెరుగైనది. దీనిని దీర్ఘ కాలం ఉపయోగించిన మీదట కూడా పని తీరుపోకుండా ఖచ్చితంగానే కొలుస్తుంది. సియఫ్‌సి, గుజ్జు, రకరకాల నేలలు, ధాన్యాలలోని చెమ్మను కూడా కొలిచి మార్పులు చేసి సాధనంతోనే కొలవవచ్చు. ఈ సాధనాన్ని ప్రముఖమైన జవుళి మిల్లులలో వాడి చూశారు. దీనివల్ల కలిగిన ఫలితాలు దిగుమతి చేసుకున్న సాధనాలు యిచ్చే ఫలితాలలో దీటుగా ఉన్నాయి.

సంపాదక లేఖలు

మేడిపూర్ విద్యాలయం

ఆర్యా!

మా నాగర్‌కర్నూలు తాలూకా మేడిపూర్ గ్రామంలో వున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగి పోతున్నది. ఇద్దరు పంతుళ్లను నియమించమని విద్యా శాఖాధికారులను అనేకసార్లు కోరియున్నాం. కాని ఫలితం శూన్యం కావటమే కాక, ఉన్నస్కూలు స్థాయిని కూడా వలంటీరు స్కూలు క్రిందకు తగ్గించారు. ఇదేమిన్యాయమో!

ఏ. లక్ష్మారెడ్డి

అయినాపురం పెద్దచెరువు

ఆర్యా!

హైదరాబాదు జిల్లా, పర్గి తాలూకాకు చెందిన మా అయినాపురం గ్రామం తాలూకా కేంద్రానికి 10 మైళ్ళ దూరంలో ఉన్నది. మా గ్రామములో భారీ యెత్తున పరిపంట పండును. వరి పంటకు ముఖ్యముగా కావలసిన జలాధారములు నాలుగు కలవు. అందులో ఒకటి, "పెద్ద చెర్వు" పేరుకు తగినట్లుగా నిజముగా యుండి మొత్తం (600) ఎకరములకు పైగా నీటి పారుదల చేయుటయే గాక, సంవత్సరమునకు ఒకవేల రూపాయలకు మించ

ద్రవిడ భజగం నాయకునికి అనుమతి నిరాకరణ

సింగపూర్, సెప్టెంబర్ 20

ఇండియా పార్లమెంటు సభ్యుడు, ద్రవిడభజగం నాయకుడైన శ్రీ ఇ.వి. కె. సంపత్ సింగపూర్‌లో ప్రవేశించటానికి స్థానిక అధికారులు అనుమతి నిరాకరించారు.

స్థానిక భారతీయులను లేనిపోని రాజకీయాల్లో ఇరుక్కునేట్టు చేయటం ఇష్టం లేకనే అతనికి అనుమతి నిరాకరించటం జరిగినదని సింగపూర్ సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ ఎస్. రాజరత్నం పి.టి.ఐ. విలేఖరితో నేడు అన్నారు.

సింగపూర్‌లో పర్యటించటానికిగాను శ్రీ సంపత్ నేడే ఇక్కడికి రావలసి ఉన్నది.

భారత ప్రభుత్వం

ఆహార వ్యవసాయ శాఖ

కాంట్రాక్ట్స్/33/59/డి—కాకినాడలో ఆహార ధాన్యాలు, ఎరువులు ఇతర కమోడిటీస్ మొదలైన వాటికి క్లియరెన్స్ మరియు స్టోరేజి పనికై కంట్రాక్టర్లుగా 15-10-1959 నుంచి లేక ప్రభుత్వంచే నిర్ణయించబడే మరే తేదీ నుంచయినా రెండు సంవత్సరాల కాలానికి నియమింప బడుటకు భారతాధ్యక్షుని తరఫున సీలువేసిన టెండర్లు తీసుకొనబడును. రీజినల్ డైరెక్టర్ (ఫుడ్), పదకన్ రీజియన్, మంగళ విలాస్, 20 లక్ష్ ఎవెన్యూ, మైలాపూర్, మద్రాసు 4 వారి కార్యాలయంలో రు. 15/- రొక్కం చెల్లించిన మీదట (వాపసు ఇవ్వబడదు) లభించే ఫారము (ఇతరుల కివ్వరాదు) పై టెండర్లను పైచిరునామాకు 7-10-1959న పగలు 4 గంటల లోపున అందునట్లు పంపాలి. సరకు రశీదును టెండరుతో పంపాలి. లేనిచో అది పరిశీలించబడదు.—D. A-540 (56).

కావలెను

శాలువలనుఅమ్మడానికిపార్ట్-టైమ్ ఏజంట్లుకావలెను. వివరాలకు, ఉచిత శాంపిల్సుకు వేడే వ్రాయండి,
Girson Knitting Works,
Ludhiana- (102)

రు. 6/- కు వాచీ

16 జ్యూయల్స్ రిస్టు వాచీ 5 ఏండ్ల గ్యారంటీతో రు. 6-కు మా చెయిన్ పిస్టమ్ స్కీంక్రిందదొరుకును. పోస్టేజి అదనం. మా కామినీ సెంటును ప్రచారం చేయడానికి ఈ స్కీము ప్రవేశ పెట్టబడినది. పూర్తి సంతృప్తి కలుగును. లేనిచో సొమ్ము వాపసు. వేడే వ్రాయండి:
London Commercial Co
P. B. 2 (W-55) Amritsar.

ఖమ్మంలో అంబర్ చరఖా పరిశ్రమాలయం

ఖమ్మం, సెప్టెంబర్ 20

ఖమ్మం పట్టణంలో హైదరాబాద్ ఖాదీ సమితివారి ఆధ్వర్యంలో అంబర్ పరిశ్రమాలయాన్ని గత వారం పూజ్య శ్రీ వినోబాజీ జయంతి సందర్భంగా ప్రారంభం జరుపబడింది. వెంనూరు నియోజక వర్గ శాసన సభా సభ్యులు శ్రీ జలగం కొండలరావు పరిశ్రమాలయ ప్రారంభోత్సవం జరిపారు.

ప్రస్తుతం తాత్కాలికంగా ఈ పరిశ్రమాలయాన్ని స్థానిక అర్వపెల్లి వారి సత్రంలో స్థాపించడం జరిగింది.

ఉదయం శ్రీ వినోబాజీ చిత్రపటాన్ని నగర ప్రధాన వీధులగుండా జైజైనినాదాలతో పరిశ్రమ స్థలానికి తీసుకున్నారు. ఊరేగింపులో శ్రీయుతులు కొండలరావు, కొమరగిరి నారాయణ రావు, గెల్లా కేశవరావు, మున్సిపల్ చైర్మన్, మరియు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ హీరాలాల్ మోరియా, అర్గనైజర్ శ్రీ కోటపున్నయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ కొండలరావు జాతీయ పతాకా విష్కరణం జరిపారు.

అనంతరం జరిగిన సభకు శ్రీ కొమరగిరి నారాయణరావు గారు అధ్యక్షత వహించారు.

శ్రీ నారాయణరావు గారు తమ అధ్యక్షోపన్యాసంలో ఖమ్మంలో పరిశ్రమాలయ స్థాపన గురించి, ఇంతకుక్రితమే ఇక్కడి ప్రముఖులు భావించినా, కొన్ని కారణాల వల్ల కొలది ఆలస్యంతో స్థాపన జరిగిందనీ, ఈ స్థాపనకు అశ్రాంతంగా దీక్షతో కృషిచేసి కృతకృత్యులైన శ్రీ వెంపటి కోటేశ్వరరావుగారు చాలా అభినందనీయులని అన్నారు.

సుమారు 20 వేల రూపాయల పెట్టుబడితో ప్రస్తుతం ఈ బృహత్పరిశ్రమ ప్రారంభించ బడుతున్నది.

శ్రీయుతులు కొండలరావు, గెల్లా కేశవరావు, హీరాలాల్ మోరియా, అర్గనైజరు శ్రీ కోటపున్నయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ లక్ష్మీనర్సయ్య, కొలిపాక కిషన్ రావుగారలు, తదితరులు కూడా ప్రసంగించారు.

బాల సంఘ వార్షికోత్సవం

నిరిపిల్ల, సెప్టెంబర్ 18

నిరిపిల్ల గ్రామ బాల సంఘం వార్షికోత్సవం 14 వ తేదీ శోభాకరంగా జరిగింది. కార్యదర్శి బాలయ్య పతాకోత్సవం జరిపారు. సాయంత్రం ఆట, పాటల పోటీలు, ఉపన్యాసాలు అయిన తర్వాత రాత్రి 8 గంటలకు సంఘ సభ్యుల వాటికా ప్రదర్శన, వినోద కార్యక్రమాలు జరిగాయి.

బాలభట విహారం

ఘరికల్లు, సెప్టెంబర్ 19

ఘరికల్లు విద్యాలయ బాలభట సంఘం వారు ముప్పది మంది 11 వ తేదీ కోయిల్ సాగరు యెక్స్‌కర్షన్ (విహారం) వెళ్ళారు. ఆ రాత్రి అక్కడే వుండి మర్నాడు సాయంత్రానికి తిరిగి స్వస్థానం చేరుకున్నారు. దారిలో కోడూరులో నారాయణపేట స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ వీరికి తేనీరు యిచ్చారు.

జహీరాబాద్, సెప్టెంబర్ 20

ఇంటి పన్ను హెచ్చింపాలని మునిసిపాలిటీ చేసిన ప్రతిపాదన పట్ల నిరసనగా సమ్మె జరపాలని స్థానిక జన సంఘం ఇచ్చిన ఆదేశాన్ని పురస్కరించుకొని నిన్న పట్టణంలో కొందరు దుకాణాలు మూసి వేశారు.

"చైనా సాగించిన పని ముమ్మాటికీ దురాక్రమణ"

రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21

భారత సరిహద్దులను చైనా వారు అతిక్రమించటం "ముమ్మాటికీ దురాక్రమణఅనీ, అది చాలా విచారకరమైన విషయం అనీ" భారత రక్షణ మంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నిన్న రాత్రి ఇక్కడ ప్రకటించారు.

"అది మాకు గాని, వారికి గాని, ప్రపంచానికి గాని ఏ విధమైన మంచినీ చేకూర్చ లేదు. విచారకరమైన ఈ అధ్యాయం త్వరలో ముగుస్తుందని ఆశిస్తున్నాను"అని అన్నారు శ్రీ మీనన్.

ఎన్.బి.సి. టెలివిజన్ గోష్ఠి లో విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా శ్రీ మీనన్ పై అభిప్రాయాన్ని ప్రకటించారు. శ్రీ నిమిపాలపాటు సాగిన గోష్ఠిలో విలేఖరులు అడిగిన ప్రతిప్రశ్నా దాదాపు ఇండియా, చైనా సంబంధాలు, లేదా టిబెట్ సంఘటనలకు సంబంధించి ఉన్నది.

సమస్యను పరిష్కరించటానికి శ్రీ నెహ్రూ పెకింగ్ వెళ్లటానికి ఇష్టపడతారా అని ఒక విలేఖరి ప్రశ్నించగా శ్రీ మీనన్ ఇలా అన్నారు:

"సమస్య శాంతియుతంగా పరిష్కారం కావటానికి అదేమార్గం అని తోచిన పక్షంలో నెహ్రూ ఆ మార్గాన్ని అవలంబించటానికి వెనుకాడరు.

"అయితే శాంతి విషయంకోసం అనినా ప్రధాని ఒకర్ని అర్థించ టానికి ఎక్కడికీ వెళ్లరు" అని అన్నారు శ్రీ మీనన్

శ్రీ మీనన్ ఇంకా ఇలా అన్నారు:

"ఇది రెండు పక్షాలకు చెందిన విషయం. సంప్రదింపులకు ఇష్టపడతారో లేదో, ఇష్టపడితే ఏ పద్ధతిలో అవిసాగాలో ముందు తేల్చుకోవాలి. మా వైపు నుంచి అనవసరమైన జగడాలేవీ రావు. అలా అని లొంగుబాటు లక్షణం కూడా ప్రదర్శించ బడదు."

టిబెట్‌లోను, చైనా సరిహద్దులలోను చైనా సాగించిన చర్యలను గూర్చి ప్రశ్నించగా "రెండు సందర్భాల్లోను చైనా వారు బలప్రయోగం మీద ఆధార పడటం జరిగిందని శ్రీ మీనన్ అన్నారు.

"అయితే అవి రెండూ దేనికవి ప్రత్యేక సమస్యలు. మా దేశం లోకి ప్రవేశించటం దురాక్రమణ; అది ఎవరు సాగించినా భారత దేశం ప్రతిఘటిస్తుంది అని అన్నారు శ్రీ మీనన్. శ్రీ మీనన్ ఇంకా ఇలా అన్నారు:

"టిబెట్ లో చైనా వారు చేసినపని చాలా క్రూరమైనది. నీతి విశుద్ధమైన చర్య. లేదా వారు దాన్ని ఇంకా ఏ విధంగా చైనా పిలవ వచ్చు. అయితే చట్ట రీత్యా స్థిరపడిన ఇండియా, చైనా సంబంధాల దృష్ట్యా టిబెట్ చైనాలో ఒక భాగం."

ఇండియా సరిహద్దులలో చైనా వారు సాగిస్తున్న చర్యలను గూర్చి మరొకసారి ప్రస్తావించి శ్రీ మీనన్ ఇలా అన్నారు:

"భారతదేశం ఈచర్యను యుద్ధానికి వాంధిగా భావించటం లేదు. యుద్ధమనస్తత్వాన్ని ప్రకోపింప జేయటం మాకు ఇష్టం లేదు. అయితే ఒకరు మమ్మల్ని తోసిరాజనటానికి గాని, మా నెత్తిమీద నుంచి నడిచిపోవటానికి గాని అవకాశం ఎన్నటికీ ఇవ్వం."

టిబెట్ వ్యవహారంలో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని దలైలామా చేసిన విజ్ఞప్తిని భారతదేశం ఎందుకు [illegible] అని ప్రశ్నించగా "దాని [illegible] కారణాలు ఉన్నాయి" శ్రీ మీనన్ అన్నారు.

"రాజ్యాంగ రీత్యా మొదట చాలా ఇబ్బందులు ఉన్నాయి. భారతదేశం టిబెట్ ను చైనా అంతర్భాగంగా భావిస్తున్నది. రెండవది ఏమిటంటే టిబెట్ వ్యవహారాన్ని సమితిలో ప్రవేశపెట్టటం వివేకవంతమైన పని కాదని మా అభిప్రాయం." అని అన్నారు శ్రీ మీనన్.

"అది రాజ్యాంగ సమ్మత మైన చర్యగా మాకు అనిపించదు. దాని వల్ల మంచి ఫలితాలు కలుగుతాయని కూడా మేం అనుకోవటం లేదు."

అయితే భారత దేశం ఈ విషయం పై సమితి లో ప్రతిపాదన దేన్నీ తీసుకు రాకపోతున్నప్పటికీ సమితిలో యీ విషయంపై స్వేచ్ఛగా అభిప్రాయాలు వెల్లడించ బడటానికి ఎటువంటి అభ్యంతరం లేదు. ఒక విధంగా అది అవసరం కూడా అయితే కావచ్చు.

ఇండియా, చైనా సరిహద్దు సంఘటనలపై ఇటీవల టాస్ వెల్లడించిన ప్రకటనను ప్రస్తావించి "ఒక కమ్యూనిస్టు దేశానికీ, కమ్యూనిస్టేతర దేశానికీ మధ్య వివాదం వస్తే దాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సోవియట్ యూనియన్ అనటం రష్యా విప్లవం తర్వాత ఇదే ప్రథమం"అని శ్రీ మీనన్ అన్నారు.

రష్యా మధ్యవర్తిత్వానికి సంబంధించి వారినుంచి వాగ్దానాలేవీ రాలేదనీ వివాదాన్ని చైనా, భారత దేశాలే పరిష్కరించు కోవాలని వారు భావిస్తున్నారనీ అన్నారు భారత రక్షణ మంత్రి.

కృశ్చేవ్‌ను ఢిల్లీకి ఆహ్వానించి ఆయనతో మాట్లాడటానికి భారత దేశం ఇష్టపడుతుందా అని ఒక విలేఖరి ప్రశ్నించగా "కృశ్చేవ్ గాని, లేకపోతే నా సరే ఢిల్లీకి రావాలనుకుంటే వారిని ఆహ్వానించి మాట్లాడటానికి భారత దేశం ఎప్పటికీ సంసిద్ధమేఅని శ్రీ మీనన్ అన్నారు.

ఐక్యరాజ్య సమితిలో చైనా కు ప్రాతినిధ్యం ఇవ్వాలని భారతదేశం తిరిగి మళ్ళీ ఎందుకు ప్రతిపాదించిందని ప్రశ్నించగా "సమితిలో చైనా ప్రాతినిధ్యం చాలా అవసరం; ఉదాహరణకు నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించటంలో వారు కూడా ఉండటం అవసరమని" శ్రీ మీనన్ అన్నారు.

శ్రీ మీనన్ ఇంకా ఇలా అన్నారు: "ఇండియా స్వప్రయోజనాన్ని బట్టి చూసినా మా సరిహద్దులోని ఒక బలవంతమైన దేశం ప్రపంచ రాజ్య కూటమికి దైట ఉండటం మాకు ఇష్టం లేదు."

ఈ విషయాన్ని ప్రతిపాదించటంలో చైనాతో ఇటీవల ఏర్పడిన సరిహద్దు వివాదాల దృష్ట్యా భారత దేశం తన వెనుకటి విధానాలను దేన్నీ మార్చుకోలేదని శ్రీ మీనన్ అన్నారు.

సమితిలో స్థానానికి దురాక్రమణను ఒక అభ్యంతరంగా లేవనెత్తటం సరైనైన వాదం కాజాలదనీ, దాన్ని ప్రాతిపదికగా తీసుకున్నట్టయితే సమితి లో చాలా దేశాలకు సభ్యత్వం ఉండేది కాదనీ ఆయన అన్నారు.

లావోస్‌కు సమితి పరిశీలక దళం

మరో యుద్ధానికి దారితీస్తుందట

హాంకాంగ్, సెప్టెంబర్ 20

లావోస్ పరిస్థితిని పరిశీలించటానికి గాను ఐక్యరాజ్యసమితి పరిశీలక బృందాన్ని పంపటం చాలా ప్రమాదానికి పరిస్థితి మరింత విషమింపజేసి కొత్తగా మరో యుద్ధానికి దారితీస్తుందని లావోస్ లోని కమ్యూనిస్టు అనుకూల పార్టీ అయిన "నియోలావో హాక్సత్" కేంద్ర సమితి ఇటీవల ఒక ప్రకటనలో హెచ్చరించినది. లావోస్ పరిస్థితిని పరిశీలించి సమిత్తం ఒక కమిటీని పంపటానికి ఇటీవల భద్రతామండలి చేసిన నిర్ణయం సమితి సూత్రావళికి 1954 జెనీవా డంబడికకు విరుద్ధంగా ఉన్నదని ఆ ప్రకటనలో పేర్కొనబడినది.

ఆకాశవాణి డ్రామా ఉత్సవాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20

ఆకాశవాణి వార్షిక డ్రామా ఉత్సవాలు సెప్టెంబర్ 21 వ తేదీ నాడు రాత్రి 9-30 గంటలకు సుప్రసిద్ధ హిందీ కవి సుమిత్రానందన్ పంత్ వ్రాసిన "పూలోంకా దేశ్" అనే సంగీత రూపకం ప్రసారం చేయటంతో ప్రారంభమౌతాయి.

ధరవరలు

కొత్తూరు పెద్దయ్య గుప్త దుకాణం

సోమవారం, 21-9-1959

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్, ఆం. ప్ర.

సన్న బియ్యము	72-8-0	78-0-0
దొడ్డు బియ్యము	65-4-0	66-0-0
అక్కులు ,,	66-0-0	67-0-0
19 నెం. బి.	66-0-0	67-0-0
తెల్ల జొన్నలు	49-0-0	51-0-0
చట్టి ,,	42-8-0	43-8-0
పచ్చ ,,	39-0-0	43-8-0
పసుపు	59-0-0	96-0-0
,,	100-0-0	—
కందులు	58-0-0	67-8-0
ఎర్ర కందులు చి.	49-8-0	53-0-0
పెసలు	46-0-0	53-0-0
మినుములు	50-0-0	52-12-0
శనగలు	43-0-0	—
ఉలవలు	36-0-0	36-8-0
బెల్లము	65-0-0	85-0-0
మిర్చి	210-0-0	230-0-0
,,	270-0-0	300-0-0
చింతపండు	120-0-0	169-0-0
ఉల్లిగడ్డ కొ.	10-0-0	18-0-0
,,	29-0-0	25-4-0
గోధుమలు	82-0-0	88-0-0
కుసుమలు	52-0-0	54-0-0
నువ్వులు	75-0-0	105-0-0
ఇలాతిసపచి. కిలో	62-0-0	64-8-0
ఇలాతిపలుకు సే.	95-0-0	93-0-0
ఆముదాలు	64-4-0	—
పత్తిగింజలు	37-0-0	43-8-0
నూనె	17-12-0	—
కందిపప్పు పె.	86-0-0	89-0-0
కందిపప్పు చి.	75-0-0	80-0-0
మినప పప్పు	70-0-0	74-0-0
పెసర పప్పు	72-0-0	74-0-0
శనగ పప్పు	53-0-0	55-0-0
సిరిశనగ పప్పు	74-0-0	76-0-0
లంకపప్పు	52-0-0	54-0-0
ధనియాలు	135-8-0	150-0-0
ఇలాతికాయ	39-0-0	40-0-0

వెండి, బంగారం ధరలు

దెబ్బడ భూమయ్య నారాయణ

ఫోన్: నెం. 5260

తేజావు బంగారం		122-50
కిసాన్ మార్కు బి.		122-75
వెండి తు.	100 కి	204-00
వెండి తు.	1 కి	2-06
వజ్రము		80-00

రేడియో

బుధవారం, సెప్టెంబర్ 23, 1959

హైదరాబాద్ [ఎ]

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-40 భక్తిరంజని: సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు 7-15. వి. ఎస్. లక్ష్మీనారాయణ్ 7-45 సంగీత శిక్షణ 8-30 హిందూస్థానీ సంగీత పాఠము.

మ॥ 1-00 మహిళా సమాజం 1-30 లయవిన్యాసము: నిలయ విద్వాంసులు 2-00 శాస్త్రీయ సంగీత్ (రికార్డులు) 2-30 ఉన్నత పాఠశాల విద్యార్థులకు (ఉర్దూ) 3-45 ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ప్రసంగము: డి. వసంతరావు

సా॥ 7-15 అదాన్ ప్రదాన్, ప్రసంగం: ఎమ్. మహబూబ్ 7-30 వార్తావాహిని 7-40 విరామ సంగీతం (రికార్డులు) 7-45 మహమ్మద్ అజీముద్దీన్ : ఘజల్ 8-00 అన్నా కర్నీనా : నాటిక 8-30 జాతీయ కార్యక్రమం, ప్రసంగం 8-50 మహమ్మద్ అజీముద్దీన్ : ఘజల్ 9-30 బంగారి బాయ్

బి

30.86 మీ (9720 కిలోసై)

మ॥2-10శాస్త్రీయసంగీతం (రికార్డులు) 2-20 పి. కుప్పుస్వామి : వయొలిన్

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వలె 6-15 ఫిల్మ్ గీతం (రికార్డులు)

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-40 భక్తిరంజని 7-45 సంగీత పాఠం.

మ॥ 1-00 ఎమ్. వి. రమణమూర్తి, జి. ఎమ్. త్యాగరాజన్: గాత్రం 1-30 వాద్యగీతి (రికార్డులు) 3-30 శ్రోతలు కోరిన పాటలు 3-45 ఉన్నత పాఠశాల విద్యార్థులకు.

సా॥ 6-15 ఫిల్మ్‌గీతం (రికార్డులు) 7-30 వార్తావాహిని 7-40 లలిత సంగీతం: వి. బాలా త్రిపురసుందరి 8-00 అన్నాకర్నీనా: నాటిక మాతృక: టాల్ స్టాయ్ కథ, రచన: "లత" 8-30 జాతీయ కార్యక్రమం; ప్రసంగం 8-50 శాస్త్రీయ సంగీతం (రికార్డులు) 9-15 లలిత సంగీతం వి. బాలాత్రిపురసుందరి 9-30 చదలవాడనుబ్బయ్య: వయొలిన్.

ఉషా కుట్టు మిషను

తయారు చేయువారు :
ది జై ఇంజనీరింగ్ వర్క్స్ లిమిటెడ్, కలకత్తా.
రొక్కం చెల్లించిగానీ వాయిదాల పద్ధతినికాని కొనవచ్చును.
—: భారతదేశానికి సోల్ సెల్లింగ్ ఏజంట్లు: —
ఏజంట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రయివేట్ లిమిటెడ్, కలకత్తా.
—: డిస్ట్రిబ్యూటర్స్ :—
నాథూలాల్ జీ
గన్‌ఫౌండ్రీ హైదరాబాద్ ఫోన్: 35118 — నిజాంపాహి రోడ్, హైదరాబాద్ — రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్ ఫోన్: 6415 — మహాత్మాగాంధీ రోడ్, సికిందరాబాద్.
ఎంబ్రాయిడరీని, కత్తిరింపులను, కుట్టడాన్ని రాష్ట్రపతిరోడ్, సికిందరాబాదులోను; సుల్తాన్‌బజార్ హైదరాబాద్‌లోను గల ఉషా సూయింగ్ స్కూల్స్‌లో నేర్చుకోండి.
(A. A.)

విజయవంతమైన 6 వ సంయుక్త వారం!

రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి
శభాష్ రాముడు
ఎన్. టి. రామారావు, గిరిజ, రమణమూర్తి, గుమ్మడి, కాంతారావు, మాలిని, దేవిక, రేలంగి.
సాగర్ హైదరాబాద్ — అలంకార్ సికిందరాబాద్
ఆటల సమయాలు: 6-00, 9-30.
మార్కండేయ వరంగల్ — రమేష్ నిజామాబాద్
(Nima) — రాజశ్రీ రిలీజ్ —

సహకారంలో ఉన్న చమత్కారం

స్వయం సహాయం, పరస్పర సహకారంవలన ఎంతటి పనులయినా ఎలా అవలీలగా సాధించుకోవచ్చునో ఉత్తర ప్రదేశ్‌లోని సేహాన్ గ్రామ మహిళలు ఋజువుచేశారు.

తమ యిళ్లకు చేరువగా ఒక బావి ఉంటే వీలుగా ఉంటుందని వారు ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నారు. అది అంత తేలికగా సాధ్యపడేదికాదని మగవారు మాట్లాడకుండా ఊరుకున్నారు.

ఒకరికొకరు సహాయంగా కృషిచేస్తే, తప్పకుండా సాధించవచ్చునని తోచింది స్త్రీలకు. అంతే, నలుగురు స్త్రీలు నడుంకట్టి బావి త్రవ్వడం ఆరంభించారు. నమ్మండి, అరవై అడుగుల లోతుకు త్రవ్వారు, నీరు పడింది!

పొరుగు గ్రామాలవారు కూడా ఈ ఉత్సాహాన్ని ఊతగా తీసుకుని కృషిచేస్తున్నారంటే, అందులో ఆశ్చర్య మేముంది?

సహకార యత్నంవలన మనకు సర్వ సౌకర్యాలూ సమకూరడమే కాక, సంఘ సంక్షేమం కూడా సాధ్యపడుతుంది. తద్వారా దేశకల్యాణం సత్వరంగా సిద్ధిస్తుంది.

ప్రణాళికకు సహకారమివ్వండి
మీ మేలుకు మీరు కృషి చేయండి!

DA-59/107

ఏట్లు, ఎందుచేత
'అనాసిన్'
అందరి నాలుగు మందులవల్ల
నొప్పిని నివారించుటకు
చాలామంచిది

'అనాసిన్' వైద్యపరంగా పరీక్షించి యున్నట్టి అందరి నాణ్యత మంచి అంతో వైద్యుని సురక్షితమైన ఔషధ యోగమువలె నొప్పిని అతిత్రమముగాను పూర్తిగాను నివారించును. అనాసిన్ (1) తలనొప్పులు, జలుబులు, పన్ను నొప్పి, తొలి నొప్పులను అతిత్రమముగా నివారించును. (2) పరమం పోట్లను శమపరచును—మిమ్ములను సుఖముగా నిద్రమింప జేయును. (3) మాంద్యమును పోగొట్టును. (4) జ్వరమును తగ్గించును. ఈ విధంగా నాలుగు మందులగుణం 'అనాసిన్' నొప్పి నివారణకు చాలామంచిది. ఎల్లప్పుడూ గృహమందు 'అనాసిన్' ను ఉంచుకోండి.

Registered User: GEOFFREY MANNERS & CO. PRIVATE LTD.

బొంబాయి ద్విభాషా రాష్ట్ర విభజనకు వ్యతిరేకత

బొంబాయి, సెప్టెంబర్ 21

భారతీయ వర్తకుల మండలి ద్విభాషా బొంబాయి రాష్ట్రి విభజనను వ్యతిరేకిస్తున్నదని మండలి కార్యదర్శి శ్రీ సి. ఎల్. ఖీవాలా కాంగ్రెస్ అధ్యక్షురాలికి తెలియజేశారు.

"జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కాని, ఆ ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా కాని, లేక మానసిక ఐక్యత సాధ్యం కాలేదనే కారణం చేతనే కాని, ఉద్యమాన్ని విరమింపజేయటానికి గాని ప్రస్తుత ద్విభాషా రాష్ట్రాన్ని మార్చవలసిన అవసరమేమీ లేదని మా మండలి గట్టిగా విశ్వసిస్తున్నది" అని ఆయన కాంగ్రెస్ అధ్యక్షురాలికి సెప్టెంబర్ 19 వ తేదీన వ్రాసిన లేఖలో తెలియజేశారు. ఆ లేఖ నేడు పత్రికలకు విడుదల చేయబడింది.

బాగ్దాద్‌లో సైనికాధికారుల ఉ

బాగ్దాద్, సెప్టెంబర్ 20

ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నినారన్న నేరానికి గాను బాగ్దాద్‌లో నేడు పదముగ్గురు సైనికాధికారులు, నలుగురు పౌరులు మరణశిక్ష విధించబడినారు.

కాసిమ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత మార్చి నెలలో మైసూర్‌లో లేచిన తిరుగుబాటుతో సంబంధం ఉందన్న నేరంపై కొందరు సైనికాధికారులకు మరణశిక్ష విధించబడినది. మిగతావారు మామూలు పౌరులు. 1958 జనవరిలో జరిగిన నిప్లవానికి ముందు దేశ విద్రోహకరమైన కుట్రలలో పాల్గొన్నారన్న నేరంపై వారికి మరణశిక్ష విధించబడినది.

మధ్య తరగతి రేవుల అభివృద్ధి కమిటీ

రాష్ట్ర ప్రతినిధులతో చర్చలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సలహాదారు, కేంద్ర రవాణా శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ హెచ్. వి. మంత్రానీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం నియమించిన మధ్య తరగతి రేవుల అభివృద్ధి కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో రేవుల అభివృద్ధి గురించి ఈ రోజున రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపినది.

ఉదయం కమిటీ రేవుల అభివృద్ధికి సంబంధించిన అధికారులు పబ్లిక్ వర్క్స్ శాఖ కార్యదర్శి శ్రీ ఆర్. ప్రసాద్, డిప్యూటీ కార్యదర్శి శ్రీ ప్రభాకర రావు, ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ ఇంజనీర్ ఎల్. వెంకట కృష్ణయ్యర్, రహదారుల చీఫ్ ఇంజనీర్ శ్రీ దుర్రాని, విద్యుచ్ఛక్తి బోర్డు చీఫ్ ఇంజనీర్ శ్రీ పప్పు, వాణిజ్య పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి శ్రీ బి. ఎల్. ఓట్స్‌తో సంభాషణలు జరిపారు.

మధ్యాహ్నం కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రులను కలిశారు. రాష్ట్రంలో ఎరువుల ఫ్యాక్టరీ స్థాపించినట్లయితే రేవుల ట్రాఫిక్ పెరిగే అవకాశముంది గనక తమ ప్రతిపాదనలను రూపొందించే టప్పుడు ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్య మంత్రి సూచించారు. ఎరువుల ఫ్యాక్టరీ రాక్ ఫాస్ఫేట్‌ను పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటుంది.

తర్వాత కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల మండలుల సమాఖ్య ప్రతినిధులతో చర్చలు జరిపారు.

కమిటీ అధ్యక్షుడు విలేఖరులతో ముచ్చటిస్తూ తమ తుది నివేదికను వచ్చే సంవత్సరం మార్చిలో, తాత్కాలిక నివేదికను ఈ నెలాంతంలో ప్రభుత్వానికి సమర్పించ గలమని ఆశిస్తున్నట్టు తెలిపారు.

మండల కాంగ్రెస్ కార్యవర్గ ఎన్నికలు

హైద్రాబాద్, సెప్టెంబర్ 21

మెదక్ జిల్లా జోగిపేట తాలూకాకు చెందిన పాపన్నపేట, టేక్మాల్, దేవనూర్, శంకరంపేట మండల కాంగ్రెస్ కమిటీలకు ఇటీవల ఎన్నుకోబడిన సభ్యులు సెప్టెంబర్ 20 వ తేదీన ఆయా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ల అధ్యక్షతన సమావేశమై ఈ దిగువ కార్యవర్గాలను ఎన్నుకొన్నారు:

పాపన్నపేట

అధ్యక్షుడు : ఎ. రామచంద్రారెడ్డి
ఉపాధ్యక్షుడు : ఎన్. మల్లారెడ్డి
కార్యదర్శి : కె. విశ్వనాథం
కోశాధిపతి : అనంతరావు
సభ్యులు: కె. సంగమేశ్వరరెడ్డి, జి. నందకుమార్, దారాగౌడ్, ఎం. బాలయ్య, పుండరీకం, మల్లేశం.

టేక్మాల్

అధ్యక్షుడు : టి. శంకరరెడ్డి
ఉపాధ్యక్షుడు: ఎన్. వెంకట రామయ్య
కార్యదర్శి : ఎన్. అంజయ్య
కోశాధిపతి : శ్యాంరావు
సభ్యులు : సి. ఎస్. శర్మ, డి. సత్యనారాయణ, కె. లింగారెడ్డి, జోగారెడ్డి, బి. వెంకట కోదండరెడ్డి, లక్ష్మణరావు.

దేవనూర్

అధ్యక్షుడు : వి. ఎన్. పట్వారీ
ఉపాధ్యక్షుడు : చెన్న బసప్ప
కార్యదర్శి: జనార్దనగౌడ్
కోశాధిపతి: నాగ సంగప్ప
సభ్యులు: భీమారెడ్డి, అంతయ్య, శ్రీపతిరావు, సెట్టి శివరావు, భాగోజీ, చంద్రప్ప.

శంకరంపేట

అధ్యక్షుడు : జి. బుచ్చయ్య
ఉపాధ్యక్షుడు: అంబటి లక్ష్మయ్య
కార్యదర్శి: జి. హనుమయ్య
కోశాధిపతి: బి. శివరాములు
సభ్యులు: వడ్లనారాయణ, కలాలి నారాయణ, సి. మల్లయ్య, ఇదునూరి రంగయ్య, కె. నాగయ్య, కె. లక్ష్మయ్య.

జాతీయ ప్రణాళికా దినోత్సవాలు

వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాలలో

తిరుపతి, సెప్టెంబర్ 20

భారత ప్రభుత్వ ప్రణాళికా సంఘం ప్రణాళికా గోష్ఠిశాఖ ఉత్తర్వుల ప్రకారము తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాలలోను, వెంకటేశ్వర ఆర్ట్సు కళాశాలలోను, పద్మావతి బాలికా కాళాశాలలోను జాతీయ ప్రణాళికా దినోత్సవాలు సెప్టెంబరు 13, 14, 15 తేదీలలో అతివైభవంగా జరిగినవి.

సెప్టెంబర్ 13వ తేదీన వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థులు డాక్టర్ బి. కె. నారాయణ్, యల్. కోదండరామ్‌గార్ల అధ్వర్యాన పేరూరు, పుల్లయ్య గారి పల్లె గ్రామములకు పోయి వయోజన విద్య, నిర్భంద విద్యల ఆచరణ పై సర్వే జరిపారు. ఆరోజున విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు శ్రీ డాక్టర్ డి. యల్. నారాయణ గారు వెంకటేశ్వర ఆర్ట్సు కళాశాల ప్లానింగ్ గోష్ఠికి ప్రారంభోత్సవం జరిపారు. వారు తమ ఉపన్యాసంలో తృతీయ ప్రణాళికా రచనకు అవసరమైన సూచనలు చేసారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాలు రాఘవచారిగారు అధ్యక్షత వహించారు.

సెప్టెంబర్ 14 వ తేదీ పాయంత్రం విశ్వవిద్యాలయ కళాశాలలో జరిగిన సమావేశానికి వెటర్నరీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద శాస్త్రి గారు అధ్యక్షత వహించారు. కోఆపరేటివ్ ట్రెయినింగ్ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీ వేణుగోపాల్ రావు గారు భారత సహకారోద్యమం భూత వర్తమాన భవిష్యత్ పరిణామాలపై సుదీర్ఘోపన్యాసం చేశారు. శ్రీ డి యల్. నారాయణగారు స్వాగతోపన్యాసం చేశారు.

సెప్టెంబర్ 15 వ తేదీన జరిగిన సమావేశానికి చారిత్రక శాస్త్ర ఆచార్యులు డాక్టర్ మారేమండ రామారావు గారు అధ్యక్షత వహిస్తూ భారత దేశంలో జరుగుతున్న రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిణామాలను గూర్చి గంభీరోపన్యాసం చేశారు.

విద్యార్థులు 14, 15 వ తేదీలలో సామూహిక గేయాలు పాడారు. బుర్ర కథలు చెప్పబడినవి. నాటికలు ప్రదర్శించబడినవి.

ఇంగ్లీషు వ్యాసానికి శ్రీ జగన్నాథంగారికి, తెలుగు వ్యాసానికి శ్రీయుతులు కె. కృష్ణుడు, యస్. జయరామ రెడ్డిగార్లకు, తెలుగు పద్యములకు శ్రీ ఆది నారాయణరెడ్డిగారికి, తెలుగు పాటలకు కె. నరసింహయ్యగారికి ఉత్తమరచన బహుమతులు ఇవ్వబడినవి.

కడప ప్రభుత్వ ప్రణాళికా ప్రచార కేంద్రం వారు నెహ్రూ ఉపన్యాసములను వినిపించారు. ప్రణాళికకు సంబంధించిన గేయాల రికార్డులు వినిపించారు. తత్సంబంధమైన ఫిలుములు కూడా చూపించారు.

సాంకేతికాభివృద్ధి సాధించనిదే ప్రగతి అసాధ్యం

టెహరాన్ విశ్వవిద్యాలయంలో ప్రధాని నెహ్రూ ఉద్ఘాటన

టెహరాన్, సెప్టెంబర్ 21

ప్రధాని నెహ్రూకు డాక్టరేట్ ఆఫ్ లాస్ గౌరవ పట్టం సమర్పించటానికి సిద్ధ పర్చబడిన స్నాతకోత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు ఆయనకు ఘనమైన స్వాగత మిచ్చారు.

శ్రీ నెహ్రూ స్టేజిమీద కనిపించగానే సమావేశ స్థలమైన ఫిరదౌసీహాలు సుదీర్ఘ కరతాళధ్వనులతో మారుమ్రోగినది. తిరిగి రెండవసారి ప్రధాని నెహ్రూ పట్ట ప్రదాన సమయంలో ధరించే దుస్తులను ధరించి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ. ఫరహాద్ సమర్పించిన గౌరవపట్టాన్ని స్వీకరించినప్పుడు కూడా కొన్ని నిమిషాలసేపు కరతాళధ్వనులతో హాలంతా మారుమ్రోగినది.

వెనుకబడిన ఆసియాదేశాల ఆర్థిక సమస్యలను గురించి ఇంగ్లీషులో 45 నిమిషాలసేపు ప్రధాని నెహ్రూ చేసిన ప్రసంగాన్ని సభికులు నిశ్శబ్దంగా విన్నారు. ప్రధాని ఉపన్యాసం ముగిసిన వెంటనే మళ్లీ హర్షధ్వానాలు చెలరేగినవి.

ప్రధాని నెహ్రూ తమ ప్రసంగంలో చెప్పిన ముఖ్యాంశం ఆసియా దేశాలు సైన్స్, టెక్నాలజీలను నేర్చుకోవాలన్నదే. అది జరిగితేనేకాని ఈ దేశాలకు భవిష్యత్తులేదని ఆయన అన్నారు

వైస్ ఛాన్సలర్ తమ స్నాతకోపన్యాసంలో భారత స్వాతంత్ర్య సమరంలో ప్రధాని పాత్రను, రచనా వ్యాసంగంలో ఆయన చేసిన కృషిని బహుముఖంగా ప్రశంసించారు.

మీకలంద్వారాను, అత్యంత విజ్ఞాన సమన్వితమైన మీ ప్రసంగాల ద్వారాను మీరు మానవజాతికి రత్నాలవంటి సాహిత్య, చారిత్రక గ్రంథాలను అందజేశారనటంలో సందేహం లేదు అని ఆయన అన్నారు.

ప్రధాని తమ ప్రసంగంలో పశ్చిమ రాజ్యాలలో పారిశ్రామిక విప్లవం వచ్చి, ఆ తర్వాత ఆ రాజ్యాలు ఆసియా రాజ్యాలపై పెత్తనం చలాయించిన ఫలితంగానే ఆసియా రాజ్యాలు జలహీనంగాను, పేదవిగాను తయారైనాయన్నారు. కొన్ని చోట్లలో పెత్తనం ప్రత్యక్షంగా ఉంటే, మరికొన్ని చోట్లలో పరోక్షంగా ఉన్నది. ఫలితంగా ఆసియా దేశాలలో అభివృద్ధి చెందగల శక్తి నశించింది. స్వాతంత్ర్యం సముపార్జించుకొన్న తర్వాత ఈ దేశాలు తమకు, యూరప్, అమెరికా రాజ్యాలకు మధ్యనున్న తారతమ్యాన్ని తొలగించుకోటానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. కాని టెక్నాలజీ సహాయం లేనిదే అది సాధ్యంకాదు. అయితే ఇతరులకు అనుకరించటం ద్వారా ఏదేశమూ అభివృద్ధి చెందజాలదు. ప్రతి దేశం తన మేధాసంపత్తిని వికసించనీయాలి. అదే సమయంలో ఇతరులు సాధించిన అభివృద్ధి నుంచి లాభం కూడా పొందాలి అని ప్రధాని అన్నారు.

ఇటీవల వచ్చిన విప్లవాలలో అన్నిటికంటే పెద్దదైనది వైజ్ఞానిక విప్లవమని శ్రీ నెహ్రూ అన్నారు. కమ్యూనిజం, సోషలిజం, ఆంటీ కమ్యూనిజం గురించిన చర్చలు ముఖ్యమైనవేకాని ఈ నాడు నిజంగా ఛేదన్మైనవాఉంటే అది పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలకు, వెనుకబడిన దేశాలకు మధ్యనే ఉన్నదని ఆయన అన్నారు.

యుద్ధంలో బాగా దెబ్బతిని ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుకోవటంలో జర్మనీ, జపాన్, రష్యాలు చాలా అభివృద్ధిని సాధించాయని ప్రధాని అన్నారు. పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత నిచ్చి, కష్టపడి పనిచేశారు గనకనే వారు ఆ అభివృద్ధిని సాధించగలిగారు. ఇంగ్లండ్ తన సామ్రాజ్యాన్ని కోల్పోయినది. కాని ఆ దేశం పూర్వంకన్న ఇప్పుడు అధిక ధనవంతంగా ఉన్నది. యుద్ధంలో అమెరికా కూడా దెబ్బతిన్నది. కాని ఇప్పుడు అనేక దేశాలకు ఇచ్చిన తర్వాత కూడా 60 చేసుకోవాలో తెలియనంత ధనం ఆదేశంలో ఉన్నది. ఇండియా, ఇరాన్ దేశాలు కూడా అభివృద్ధిని సాధించాయి. కాని వాటితో పోల్చిచూచినప్పుడు ఈ అభివృద్ధి మందకొడిగా సాగుతున్నది అని ఆయన అన్నారు.

అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు, వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు పోలికలు చాలా తక్కువగా ఉన్నాయని ప్రధాని అన్నారు. వెనుకబడిన దేశాలు తమ దేశాలకు వర్తించే ప్రత్యేక ఆర్థిక సూత్రాలను రూపొందించుకోవలసిన అవసరం కలదని ఇటీవలి గుర్తించాయి. ఆసియా దేశాలు ఇతర దేశాల నుంచి అనేక విషయాలు నేర్చుకోవచ్చు కాని తమ పరిస్థితులకు అనుగుణ్యమైన సూత్రాలను రూపొందించుకోవటం అవసరమని ప్రధాని అన్నారు.

మరో విషయమేమిటంటే యూరప్‌లో ఆర్థిక విప్లవం ముందు వచ్చి, రాజకీయ విప్లవం తర్వాత వచ్చినది. అందుకే వారు రాజకీయ విప్లవ ఫలితంగా వచ్చిన పరిణామాలను ఎదుర్కోగలిగారు. కాని భారత దేశంలాటి దేశాలలో రాజకీయ విప్లవం ముందు వచ్చినది అని ఆయన అన్నారు.

సర్వసమృద్ధమైన ఆర్థిక వ్యవస్థను తీసే సాంకేతికాభివృద్ధిని సాధించనిదే ఆసియా దేశాల ప్రజలకు దారిద్ర్యం, దుఃఖం నుంచి విముక్తి లేదని ప్రధాని అన్నారు

శ్రీ పాటిల్ సూచన

(1 వ పేజీ తరువాయి)

తెలుసుకొన్నానని ఆయన అన్నారు ఏదైనా లోపం అంటూ ఉంటే అది పంపిణీ విధానంలోనే నని, పంపిణీ విధానాన్ని సక్రమమైన పద్ధతిలో నిర్వహిస్తే అంతా చక్కబడ గలదని ఆయన అన్నారు.

అయితే పంపిణీ విధానం సంస్కరణను గూర్చి ఆయన వివరంగా చెప్పలేదు.

ప్రభుత్వ పరంగా ధాన్యం వ్యాపారం సాగించే విషయమై జాతీయాభివృద్ధి మండలి ఎట్టి నిర్ణయాన్ని గైకొనలేదనీ, నిర్ణయం గైకొనలేదు గనుక జాతీయాభివృద్ధి మండలి ప్రభుత్వ వ్యాపారాన్ని సమర్థిస్తుందనుకోరాదనీ ఆయన అన్నారు.

ఆహారోత్పత్తిని అధికం చేయటానికి ప్రభుత్వం గైకొన్నచర్యలను ఆయన వివరించారు.

ఆహార మండలాలను మరింత పెద్దవిగా, సహజంగా ఉండేటట్టు ఏర్పాటు చేసే విషయం ఆలోచిస్తున్నామని ఆయన అన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆయుర్వేద మహామండలి

ఏలూరు, సెప్టెంబర్ 14

ఆసవారిష్టాదులపై నిషేధం తొలగించాలని ఆయుర్వేద వైద్యుల రిజిస్ట్రేషన్ ఫారములు విరివిగా అచ్చువేసి, అందరికీ లభ్యమయ్యేటట్లు చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఆయుర్వేద వైద్యమహా మండలి సభలో తీర్మానించారు. సభలు ఏలూరులోని అంజుమాన్ లైబ్రరీలో శ్రీ మొగల్ ఘస్తాన్ అధ్యక్షతన జరిగినాయి. ఆయుర్వేద బోర్డును రద్దు చేయాలని శ్రీ ప్రకాశ తంత్ర శతపథి, టి. వి. రామానుజ స్వామి గార లుపన్యసించారు.

పరీక్షా విధానంలో లోపాలు

(1వ పేజీ తరువాయి)

టానికి ఆయన కారణాలను వివరించారు. పరీక్షా నిర్వహణ బోర్డులకు, విద్యాసంస్థలకు సంబంధం ఉండటంలేదనీ, సంబంధం కల్పించటం చాలా అవసరమనీ ఆయన అన్నారు.

సెకండరీ విద్యా ప్రమాణాలు పడిపోతున్న విషయాన్ని గూర్చికూడా ఆయన ప్రస్తావించారు.

పరీక్షా విధానాల సంస్కరణ విషయమై సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్ సిఫార్సులను ప్రస్తావించి, విద్యా సంస్థలోనే విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పరీక్షించే ఏర్పాటువల్ల ఉపాధ్యాయులు పక్షపాతం ప్రదర్శించే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతవిద్యావిధానంలోకూడా ఆ అవకాశంఉన్నదనిఆయనఅంగీకరించారు. బాలబాలికల శక్తి సామర్థ్యాలను పెంపొందించి, ఉపాధ్యాయులకు విశ్వసించి, విద్యా సంస్థలోనే పరీక్షను నిర్వహించే పద్ధతిని మొదట్లో కొంత వరకు ఆచరించాలని ఆయన సూచించారు.

కొత్తరకం పరీక్షలను నిర్వహించాలనే సూచనలపై కూడా ఆయన ప్రసంగించారు.

విద్యా మంత్రిత్వ శాఖ సిఫార్సులను జాగ్రత్తగా పరిశీలించాలని ఆయన సమావేశానికి విజ్ఞప్తి చేసారు.

ఆంధ్ర పారిశ్రామిక వేత్త విదేశ సంచారం

హైదరాబాద్, సెప్టెంబర్ 20

ప్రముఖ ఆంధ్ర పారిశ్రామిక వేత్త శ్రీ యం. వారిశ్చంద్రప్రసాద్ (తణుకు) ఈ రోజు బొంబాయిలో బయలుదేరి విదేశ పర్యటనకు వెళ్తున్నారు. వీరు తూర్పు, పశ్చిమ జర్మనీలు, స్వీడన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్సు, ఇటలీ, ఇంగ్లాండ్ దేశాలలో పర్యటించి, రెండు కోట్ల రూపాయలతో తాము నెలకొల్పనున్న వివిధ పరిశ్రమలకు అవసరమైన యంత్ర సామగ్రికి ఆర్డర్లు యిచ్చివస్తారట శ్రీ ప్రసాద్‌తో వారి సాంకేతిక సలహాదారు శ్రీ రామయ్య కూడా వెళ్తున్నారు వీరు నిర్మించే నాల్గు ఫ్యాక్టరీలలో రెండు కొవ్వూరులోను, ఒకటి తణుకులోను, నాల్గవది రాజమండ్రిలోను నెలకొల్పుతారు. ఫ్యాక్టరీకు కావలసిన యంత్ర సామగ్రిలో సగభాగం స్వదేశంలోనే తయారగునని, తయారు చేయటానికి వీలుంటుందని విదేశ మారక ద్రవ్యం కోటి రూపాయలు మాత్రమే చాలునని తెలుస్తున్నది.

రాజమండ్రి ఫ్యాక్టరీ రోజుకు 11.5 టన్నుల కాస్టిక్ సోడా, క్లోరైన్‌లు తయారు చేస్తుంది. తణుకు ఫ్యాక్టరీ రోజుకు 6 మొదలు 8 టన్నుల యాసిటిక్ ఆసిడ్, ఎసిటిక్ ఎన్. హైడ్రైడ్ అను వుత్పత్తి చేస్తుంది. ఈ రెండు పదార్థాలు మందులు తయారు చేసే వారికి అవసరం. కొవ్వూరు ఫ్యాక్టరీలలో ఒకదానిలో సల్ఫ్యూరిక్స్ ఆసిడ్, సూపర్ ఫాస్ఫేటు రోజుకు 100 టన్నులు ఉత్పత్తి అవుతుంది దీనికి కావలసిన ముడి పదార్థాలు విదేశాల నుండి దిగుమతి కావలసిందే. కొవ్వూరులోని వేరొక ఫ్యాక్టరీలో తూములు తయారు చేస్తారట.

లాల్ బహాదుర్ శాస్త్రి ప్రకటన

(1వ పేజీ తరువాయి)

ఇక్కడికి 42 మైళ్ల దూరంలో ఉన్న యెమ్మిగనూర్ సహకారగృహనిర్మాణ కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

ఈ కేంద్రం స్వల్పాదాయ వర్గాల కోసం కేంద్రం తలపెట్టిన గృహనిర్మాణ పథకం క్రింద ఏర్పరచబడింది.

ఈ సందర్భంలో ప్రసంగిస్తూ శ్రీ శాస్త్రి చేనేత గుడ్డల ఉత్పత్తిని పెంచటానికి, వాటికి విదేశాలలో చాలా గిరాకీ ఉంది గనుక వాటిని ఎగుమతి చేయటానికి కృషి జరప వలసిన అవసరాన్ని ఉద్ఘాటించారు.

ఈ సమావేశానికి స్థానిక పరిపాలనా మంత్రి శ్రీ డి. సంజీవయ్య అధ్యక్షత వహించారు.

నెహ్రూ నగర్ మహిళా సేవా సంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 18

నెహ్రూనగర్ మహిళా సేవాసంఘ పునర్నిర్మాణం నేడిక్కడ జరిగింది. నూతన అధ్యక్షురాలు శ్రీమతి ఇల్లెందల సరస్వతీదేవి (శాసనపరిషత్తుసభ్యురాలు), కార్యదర్శిగా శ్రీమతి రాజాబాయి గారలు నియుక్తులయ్యారు. ఈ మహిళా సంఘానికి అనుబంధంగా కుమారి యస్. సుభద్రాదేవి కన్వీనర్‌గా బాలానంద సంఘంకూడా ఏర్పాటైంది.

పొగాకు నిల్వల అమ్మకం

ప్రభుత్వ వ్యాపార సంస్థ ఏర్పాట్లు

గుంటూరు, సెప్టెంబర్ 21

జపాన్ టొబాకో మనోపలీ అనే సంస్థకు పొగాకు సరఫరా చేయటానికి ప్రభుత్వ వ్యాపార సంస్థ ఒక ఒప్పందం కుదుర్చుకొన్నది. నాటు పొగాకు చాలా నిల్వ ఉండి పోయిన కారణం దృష్ట్యా ఉత్పత్తి దారులకు సౌకర్యం కల్గించే ఉద్దేశంతో ఈ ఒప్పందం క్రింద కేవలం నాటు పొగాకును మాత్రమే సరఫరా చేయటానికి సంస్థ నిర్ణయించింది.

ఈ విషయాన్ని ప్రభుత్వ వ్యాపార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ డి. శాండిల్య వెల్లడించారు.

నాటు పొగాకు ఉత్పత్తి దారులు తమ వద్ద ఎంతో పొగాకు నిల్వ ఉండిపోయిందని సంస్థ వద్దకు రాయబారాలు తీసుకొని వచ్చారని, ఉత్పత్తిదారులపై ఒత్తిడి తగ్గించి ప్రభుత్వం వ్యాపార సంస్థకు లభించేధరలో నుంచి వారికి వీలైనంత లాభం కల్గించటానికి గాను ఈ ఒప్పందం క్రింద కేవలం నాటు పొగాకునే సరఫరా చేయాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు.

ఉత్పత్తి దారుల వద్దనుంచి పొగాకును సేకరించి గ్రేడ్లు నిర్ణయించటానికి ఏర్పాటు చేసే నిమిత్తం సంస్థ ఏజెంట్లను నియమించినది. గిడ్డంగివద్ద సి. బి. ఆర్. గ్రేడు పొగాకుకు పౌనుకు 66 నయా పైసలు, సి. డి. కె గ్రేడు పొగాకుకు పౌనుకు 53 నయా పైసలు చెల్లిస్తారు అయితే వీటిలో నుంచి గ్రేడింగ్, ఇతర ఛార్జీలను మినహాయిస్తారు.

నాటు పొగాకును ఉత్పత్తి చేసే రాష్ట్రాలలో ప్రథమ స్థానం కల్గి ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ పొగాకు నిల్వలు 230 లక్షల పౌనుల వరకు ఉన్నాయి. ఈ పొగాకును అమ్మివేయటానికి మార్గాలను అన్వేషించే నిమిత్తం ప్రస్తుతం ఒక సమావేశం జరుగుతున్నది

సిలోన్ ప్రధాని విదేశ పర్యటన

కొలంబో, సెప్టెంబర్ 21

సిలోన్ ప్రధాని శ్రీ సాలమన్ బండార్ నాయకే సెప్టెంబర్ 28 నుంచి మూడు వారాల పాటు విదేశాలలో పర్యటించటానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకొన్నట్టు అధికారికంగా తెలిసినది. ఆయన ఐక్యరాజ్యసమితి, లండన్, బోన్, పారీ వెడతారు.

అమ్మాన్, సెప్టెంబర్ 20

రాజుహుస్సేన్ ఆమోదంతో జోర్డాన్ మంత్రివర్గ పునర్నిర్మాణం నేడు జరిగింది. ఇప్పటి వరకు విదేశాంగ వ్యవహారాలు ప్రధాని చూస్తున్నారు. ఇక నుంచి విదేశాంగ శాఖా మంత్రిగా శ్రీ హుస్సా. వాజర్ వ్యవహరించుతారు.



సోల్ ఏజంట్లు: బాచా తీర్థ్ 86, సైనియప్ప నాయక్ వీధి మద్రాసు-3.

నేడే చూడండి! నేడే చూడండి!!
రమణ్ బి. దేశాయ్ సమర్పించు
గృహలక్ష్మి
వండరీబాయ్, సాహుమోడక్, లలితాపావర్
ప్యారడైజ్ సికిందరాబాద్
ఆటల సమయాలు : 6-30, 9-30
(Nima) — శ్రీ బాలాజీ పిక్చర్స్ రిలీజ్ —

నేడే చూడండి! నేడే చూడండి!!
సిప్పీ ఫిలిమ్స్ వారి
భాయి బహెన్
జానీవాకర్, డెయిసీ ఇరానీ, బేబీనాజ్, నిశీ, రెహమాన్, అన్వర్ హుస్సేన్, షమ్మీ
దర్శకత్వం జి. పి. సిప్పీ
సంగీతం ఎన్. దత్తా
అశోక్ హైదరాబాద్ మనోహర్ సికిందరాబాద్
(Trupix) — విజయ రిలీజ్ —

నేడే చూడండి! నేడే చూడండి!!
ముక్కోటి ఆంధ్రులను మైమరపిస్తున్న ఉత్తమ జానపద చిత్రం
పాన్సలూరి బ్రదర్స్ వారి
దైవబలం
(సగానికి పైగా కలరు)
ఎన్. టి. రామారావు, జయశ్రీ, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, శివరావు, గుమ్మడి, ముక్కామల, మాలతి, పద్మినీప్రియదర్శిని, బాల
దర్శకుడు: వసంత కుమార రెడ్డి

ప్యాలెస్-హైదరాబాద్ రాజేశ్వర్-సికిందరాబాద్
3 ఆటలు: 3-00, 6-15, 9-30 2 ఆటలు: 6-15, 9-30
రాజరాజేశ్వరి-వరంగల్
(Nima) - నవయుగ రిలీజ్ -

విజయవంతమైన 4వ సంయుక్త వారం!
చందమామ ఫిలిమ్స్ వారి
సిపాయికూతురు
గుమ్మడి, జమున, సూర్యకాంతం, నాగయ్య, విజయలక్ష్మి, బాలకృష్ణ, పేకేటి, వంగర, సత్యనారాయణ, పెంపుడు కుక్క (ఝాన్సీ).
గుర్రం (కల్యాణి)
దర్శకత్వం: పి. చంగయ్య, బి.ఏ., సంగీతం: ఎమ్. ఎస్. రాజు
దీపక్ మహల్ హైదరాబాద్ చిత్ర సికిందరాబాద్ లక్ష్మి వరంగల్
ఆటల: సమయాలు: 6-00, 9-30

విడుదల తేదీకై నిరీక్షించండి!
లలిత్ కళామందిర్ వారి

జాల్ సాజ్
నటీనటులు: కిశోర్ కుమార్, మాలాసిన్హా, ప్రాణ్ ఇత్యాదులు
దర్శకత్వం: అరబిందో సేన్ సంగీతం: ఎన్. దత్తా
—: తర్వాత చిత్రం :—
లిబర్టీ-హైదరాబాద్ మిసర్వా-సికిందరాబాద్
(Nima) — అమర్ పిక్చర్స్ రిలీజ్ —

4 వ దిగ్విజయ సంయుక్త వారం!
పద్మినీ పిక్చర్స్ వారి

వీరపాండ్య కట్టబ్రహ్మన
(గేవాకలర్ తెలుగు చిత్రం)
శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, ఎస్. వరలక్ష్మి, పద్మిని, రాగిణి.
కమల్ హైదరాబాద్ అజంతా సికిందరాబాద్
తర్వాత చిత్రం రామా వరంగల్
ఆటల సమయాలు: 6-00, 9-30.
(Trupix) — శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్ —

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukaramjahi Road, Hyderabad.